ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

6-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	40	28
నరసరావుపేట	39	27
బాపట్ల	38	29
రెంటచింతల	40	28
చీరాల	38	29





మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ప్రతిజ్ఞ చేస్తున్న రాజధాని ప్రాంత రైతులు, అధికారులు

అమరావతి.. ఆహ్లాదం

❖ సుందర నగరంగా రాజధాని ❖ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత ❖ ప్రతిఒక్కరూ పది మొక్కలు నాటి.. పెంచాలి
❖ ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో సీఎం చంద్రబాబు
❖ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలసి రాజధానిలో మొక్కలు నాటిన ముఖ్యమంత్రి

ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్

పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత. పర్యావరణాన్ని పరిరక్షించడంలో దేశానికే ఏపీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. 2047 నాటికి 50శాతం పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటాం. వచ్చే పర్యావరణ దినోత్సవం నాటికి రాష్ట్రంలో 5.58 కోట్ల మొక్కలు పెంచాలని సంకల్పించాం. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికి సవాల్ విసురుతోంది. వర్షాలు తగ్గిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. సాగు ప్రమాదంలో పడింది. ఫ్లోరైడ్ పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ ప్రమాదాల నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలి.

-ముఖ్యమంత్రి చంద్రబాబు



రాజధాని ప్రాంతం అనంతవరంలో మొక్కలు నాటుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు

తుళ్లూరు, గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'దేవతల రాజధానిగా విలసిల్లి ప్రస్తుతం ఆంధ్రుల రాజధాని అయిన అమరావతి భవిష్యత్‌తరాలకు దిక్సూచిగా మారుతుంది. ప్రజా రాజధాని అమరావతిని ఆహ్లాదంగా.. సుందర నగరంగా తీర్చిదిద్దుతాం. మియావాకీ తరహా గార్డెన్లు, చైనా, కొరియా, జపాన్ వంటి దేశాల మొక్కలను పెంచి పచ్చదనంతో రాజధానిని నింపుతాం..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం తుళ్లూరు మండలం అనంతవరంలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి ఏడీసీఎల్ పార్కులో చంద్రబాబు మొక్కలు నాటారు. అనంతరం సభా వేదిక వద్ద పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కాలుష్య మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లలోని చేనేత వస్త్రాలతో, అరటి బోదెలతో రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతవరం హైస్కూలులో పదో తరగతి చదువుతున్న బాలిక భూక్యా మాలతి సభికులతో పర్యావరణ పరిరక్షణపై ప్రమాణం చేయించింది. నల్లమల అడవుల్లో 2 లక్షల ఎకరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి కోట్ల సంఖ్యలో విత్తన బంతులను వేసిన అంకారావును ఘనంగా సన్మానించారు. అదే వేదికపై ఆయనను రాష్ట్ర అటవీశాఖ సలహా దారుగా నియమిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. సభలో ముఖ్య మంత్రి ప్రసంగిస్తూ రాష్ట్ర విస్తీర్ణంలో 30.05 శాతం పచ్చదనం ఉందని 2047 నాటికి 50 శాతానికి తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకు న్నామన్నారు. ఇందుకోసమే సీడ్ రాఖీ కార్యక్రమంలో ఏటా మహి ళలు తమ అన్నదమ్ముల నక్షత్రాలకు చెందిన మొక్కల విత్తనాలతో తయారుచేసిన సీడ్ రాఖీలను కట్టాలని కోరారు. వాటిని నాటి తమకు రక్షణ కల్పించినట్లే ఆ మొక్కలకు కూడా సంరక్షణ కల్పించాలని కోరాలన్నారు. తద్వారా మొక్కల పెంపకంలో మహిళలు కీలక భూమిక పోషించాలన్నారు.

● కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

ఒక్క రోజే కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్నిస్తోందని చంద్రబాబు తెలిపారు. తడి పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తను ఇంట్లోనే కంపోస్టుగా వినియోగించుకుంటూ టెర్రస్, కిచెన్ గార్డెనింగ్ చేస్తే మంచిదన్నారు. మిగిలిన పొడి వ్యర్థాలను రీసైక్లింగ్, రీయూజబుల్ పద్ధతుల్లో పునర్వినియోగించుకుని కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు.

అంకారావులాగా మొక్కలు నాటతా: పవన్‌కల్యాణ్

ఫారెస్ట్ మ్యాన్ కొమెర అంకారావు కృషిని, సంకల్పాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కొనియాడారు. నల్లమల (మిగతా 6లో)



స్టాల్స్‌లో వస్తువులను పరిశీలిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

జీడీసీసీ బ్యాంకు ఆవరణలో మొక్కను నాటుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చీఫ్ విప్ జీవీ, చైర్మన్ మక్కెన, ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి తదితరులు



వన..మహోత్సాహం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా వనమహోత్సవం ఉత్సాహంగా జరిగింది. గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున మొక్కలు నాటారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడతాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. గుంటూరులోని జీడీసీసీ బ్యాంకు ఆవరణలో మొక్కను మంత్రి అచ్చెన్నాయుడు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి తదితరులు నాటారు. నల్లపాడులోని రైల్వే ఫ్రైట్ డిపోలో డీఆర్ఎం సుధేష్టసేన్ మొక్కలు నాటారు. సంగడిగుంటలోని విద్యుత్‌భవన్ ఆవరణలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి విద్యుత్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)



సీసీ రోడ్డు



కాలువల నిర్మాణం

● 'ఉపాధి పథకం' బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు ● మూడు జిల్లాలో రూ.166.46 కోట్లు పెండింగ్
● కేంద్రం నుంచి నిధులు విడుదల

తీరనున్న బిల్లుల బాధలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి మరీ ఉపాధి హామీ పథకం పనులు చేసిన వారికి బిల్లుల బాధలు తీరనున్నాయి. బిల్లులు చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వారం రోజుల్లో బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉపాధి పథకం కింద సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, నీటి తొట్లు వంటి పను లను పల్లెల్లో పెద్ద ఎత్తున చేశారు. పనులు పూర్తిచేసి 8 నెలలు గడిచిపోయాయి. పాడి రైతులు నిర్మించుకున్న గోకులాలకు కూడా బిల్లులు చెల్లించ లేదు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సుమారు రూ.166.46 కోట్ల విలువైన బిల్లులు చెల్లించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నారు.

పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లుల చెల్లింపులు (మిగతా 6లో)



లెదర్ పార్కుకు.. స్థల పరిశీలన

● వినుకొండలో వెంకుపాలెం.. నకరికల్లులో గుండ్లపల్లికి తైవాన్ బృందం
● ఆసక్తి చూపుతున్న ప్రైమ్ ఏషియా కంపెనీ యూఎస్‌ప ప్రతినిధులు

వినుకొండటౌన్, నకరికల్లు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో లెదర్‌పార్కు ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతు న్నాయి. తైవాన్ దేశానికి చెందిన ప్రైమ్ ఏషియా(యూఎస్‌ఏ) కంపెనీ లెదర్‌పార్కు ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది. ఈ క్రమంలో ఆ కంపెనీ ప్రతినిధులు వినుకొండ మండలంలోని వెంకుపాలెం, నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో పర్యటించి భూములను పరిశీలించారు. వెంకుపాలెం సమీపంలోని సర్వే నెంబరు 1లో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమిని, గుండ్లపల్లిలో సర్వే నెంబరు 702లో భూముల్ని ఈ బృందంలోని అమెరికన్ వనరుల ఉపాధ్యక్షుడు ఇన్‌షేర్, లెదర్‌పార్కు లీడర్ బ్రైన్లీ, ప్రాజెక్టు మేనేజర్ జేమ్స్‌లకు స్థానిక అధికారులు చూపారు. ఆయా భూముల బ్లూప్రింట్‌తో పాటు నీటి వనరులు తదితరాల గురించి కంపెనీ ప్రతినిధులు అధికా రుల నుంచి వివరాలు తీసుకున్నారు. వెంకుపాలెం సమీపంలోని సింగర చెరువు నీటిని విని యోగించుకోవచ్చని తహసీల్దారు సురేష్ నాయక్, సర్వేయర్ చండీరాణీ చెప్పారు. గుండ్లపల్లిలోని (మిగతా 6లో)



వినుకొండకు సమీపంలోని వెంకుపాలెం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న లెదర్ పార్కు కంపెనీ ప్రతినిధులు

అట్టహాసంగా ప్రమాణం

● జీడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల బాధ్యతల స్వీకారం
● రైతులకు అన్ని విధాల సహకారం : మక్కెన మల్లికార్జునరావు
● రైతుబిడ్డగా సేవ చేస్తా : వడ్రాణం హరిబాబు



జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మక్కెన మల్లికార్జునరావు



డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వడ్రాణం హరిబాబు

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీల పాలకవర్గాలు గురువారం కొలువుదీరాయి. డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లుగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వడ్రాణం హరిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. మక్కెన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సమక్షంలో గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకారభవన్‌లో, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ సమక్షంలో కోర్టు రోడ్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో వడ్రాణం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. మక్కెన మాట్లాడుతూ రైతు బిడ్డ అయిన తాను రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తానన్నారు. గతంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, ఎంతటి వారినైనా వదిలేదిలేదన్నారు. జీడీసీఎంఎస్ చైర్మన్‌గా రైతులకు సేవచేస్తా అని వడ్రాణం హరిబాబు తెలిపారు. రైతులకు సకాలంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు గిట్టుబాటు ధరకు అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు.

విద్యుత్ అంతరాయాలు తగ్గిస్తాం

నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నివారించేందుకు సబ్ డివిజన్ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారెడ్డి తెలిపారు. గుంటూరు సంగడిగుంట విద్యుత్ భవన్‌ను సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ గురువారం సందర్శించారు. వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉండాలంటే అన్ని లైన్లతో పాటు ట్రాన్స్‌ఫా ర్మర్లు, ఎల్‌టీ లైన్లన్నీ నిర్వహణ బాగుండేలా చూస్తామన్నారు. పీఎం సూర్యఘర్ పథకం అమలు కోసం లక్ష్యాలు నిర్దేశించామన్నారు. క్షేత్రస్థాయిలో వినియోగించే విద్యుత్ పరికరాలు కొరత పెద్దగా లేదన్నారు. ఈ నెలాఖరు లోగా సర్కిల్స్ వారీగా ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కొత్త సర్కిల్స్‌కు సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఏఈ, ఉద్యోగుల ఖాళీలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సెక్షన్లను పెంచాలన్నారు.



సంగడిగుంట విద్యుత్ భవన్‌లో పర్యటిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్ తదితరులు

రాజధానిలో అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్

రాజధాని సీఆర్‌డీఏ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ నెట్‌వర్క్ ఉంటుందని సీఎండీ తెలిపారు. ఇప్పటికే శాఖా పరంగా చేయాల్సిన పనులు పూర్తి చేశామన్నారు. రాజధాని అమరావతిలో విద్యుత్ సరఫరా అంతా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లంతా అండర్ గ్రౌండ్‌లోనే ఉంటాయన్నారు. ఈ సమావేశంలో గుంటూరు సర్కిల్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, ఎస్ఏవో పాశం రామిరెడ్డి, పలువురకు ఈఈలు ఇతర అధికారులున్నారు.

తీరనున్న బిల్లుల బాధలు

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. బిల్లులు వెనువెంటనే వస్తాయనే ఆశతో పెద్ద ఎత్తున పనులు చేశారు. పల్నాడు జిల్లాలో రూ.90.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.62.18, గుంటూరు జిల్లాలో రూ.13.79 కోట్లు బిల్లుల బకాయిలున్నాయి.

గోకులాల బిల్లుల పరిస్థితి అలానే ఉంది. పల్నాడు జిల్లాలో 702, బాపట్ల జిల్లాలో 691, గుంటూరు జిల్లాలో 383 షెడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో పల్నాడ్లులో 513, బాపట్లలో 539, గుంటూరులో 259 పూర్తి అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మిగిలిన షెడ్ల నిర్మాణాలు వివిద దశల్లో ఉన్నాయి. విడతల వారీగా బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు నిలిపివేశారు. అధిక శాతం షెడ్లు నాలుగు నుంచి ఆరు పశువుల యూనిట్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు మూడు జిల్లాల్లో రూ.19 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు ఉపాధి హామీ అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి. గోకులాల బిల్లులు కూడా త్వరలోనే చెల్లించనున్నారు.

లెదర్ పార్కుకు స్థల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

వనరుల గురించి తహసీల్దారు పుల్లారావు, డీటీ కొండారెడ్డి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ తోట సిద్ధయ్య, వీఆర్వో కొండ కంపెనీ ప్రతినిధులకు వివరించారు.

2027లో ఉత్పత్తి ప్రారంభం..

ఆరు మిలియన్ డాలర్లతో(రూ.520 కోట్లు) స్థాపించి 2027లో ఉత్పత్తి ప్రారంభిస్తామని బ్రైస్లీ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2026 లెదర్ పార్కును ఏర్పాటు చెయ్యాలనే ఉద్దేశంతో ఉన్నామన్నారు. తొలుత తమిళనాడులో ఏర్పాటు చెయ్యాలని అనుకున్నామని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో వనరులు అధికంగా ఉండడంతో ఇక్కడకు వచ్చామన్నారు. ఇక్కడ కంపెనీలో 2500 మంది ఉపాధి లభిస్తుందన్నారు. ఇండియా, బంగ్లాదేశ్ పారిశ్రామిక మేనేజర్ లెనిన్ మాట్లాడుతూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు లెదర్‌పార్కుపై ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారన్నారు. కంపెనీ ప్రతినిధులు సంతృప్తి మేరకు 100 శాతం వినుకొండకు లెదర్ పార్కు వస్తుందన్నారు. వీరి వెంట కంపెనీ గైడ్ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే పీఏ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అమరావతి.. ఆహ్లాదం

(5వ పేజీ తరువాయి)

అటవీ పరిరక్షణ కోసం మూడు దశాబ్దాలుగా అలుపెరగకుండా పని చేస్తున్న కొమ్మిర అంకారావు లాంటివ్యక్తి జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. అంకారావు గురించి తెలుసుకుంటున్న కొద్దీ ఆసక్తికరంగా ఉందని చెప్పారు. ఆయనకులాగా తాను కూడా కోటి మొక్కలు నాటాక సగర్వంగా మాట్లాడతానని చెప్పారు. ఈ ఏడాది కోటి మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకుంటానన్నారు. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణంపై అవగాహన కలిగిన గొప్ప వ్యక్తి చంద్రబాబునాయుడన్నారు. నీరు-చెట్టు వంటి పనులు చంద్రబాబు హయాంలో విజయవంతంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య, ఏడీసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, పీసీసీఎఫ్ ఏకే.నాయక్, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, రాజధాని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

స్క్రూటినీలు.. రూ.లక్షల వసూళ్లు



● దళారీ పాత్ర పోషిస్తున్న అకౌంటెంట్‌లు
● స్క్రూటినీ వేయించేది, సెటిల్ చేసేది వాళ్లే
● లావాదేవీలు పరిశీలనతో కలెక్షన్లు

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య సంస్థలపై స్టేట్ గూడ్స్ అండ్ సర్వీసు ట్యాక్స్ వేస్తున్న స్క్రూటినీలు ఆ శాఖలో కొంతమంది అధికారులకు, దళారులకు రూ. లక్షలు కురిపిస్తున్నాయి. కొంతమంది అకౌంటెంట్‌లు మధ్యవర్తుల ముసుగు ధరించి అధికారులకు చెప్పి స్క్రూటినీలు వేయించి.. వాళ్లే సెటిల్‌మెంట్ చేస్తూ అనతి కాలంలోనే భారీ మొత్తంలో నగదు పోగేసుకొంటున్నారు. తమ ఫరంపై ఎక్కడ స్క్రూటిని వేస్తారోనని వ్యాపార వేత్తలు హడలిపోతున్నారు. ముఖ్యంగా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు, బులియన్, పత్తి, మిర్చి వంటి వ్యాపారాలు చేసే ఫరంలే వీళ్ల టార్గెట్. ఒకేసారి ఐదు నుంచి పదేళ్ల వ్యాపార లావాదేవీలకు సంబంధించి రికార్డులు అడుగుతున్నారు. ఇక్కడ ఆర్‌సీ ఉంటే వేరే ఊరిలో ఉన్న ఎస్‌జీ ఎస్‌టీ ఆఫీసులో స్క్రూటినీ వేస్తున్నారు. ఒకటికి పది సార్లు ఆఫీసుల చుట్టూత తిప్పించుకొంటూ క్రమంగా వ్యాపార వేత్తలే లొంగి వాళ్లతో రాజీ బేరానికి వచ్చేలా చేసుకొంటు న్నారు. ఆదాయాన్ని బట్టి 10 శాతం వరకు డిమాండ్ చేస్తూ అందిన కాడికి వెనకేసుకొంటున్నారు.

గుంటూరులో ఇలా..

వివిధ రకాల వ్యాపారాలకు గుంటూరు జిల్లా పెట్టింది పేరు. పత్తి జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు ఇక్కడ ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. మిర్చి ఎగుమతి ఫరంలు 385 వరకు ఏర్పాటయ్యాయి. దేశ, విదేశా లకు మిర్చి ఎగుమతి జరుగుతుంది. వీళ్ల టర్నోవరే ఏడాదికి రూ. 6 వేల కోట్లకు పైగానే ఉంది. బంగారు, వజ్రాభరణాల దుకాణాలు, షో రూంలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అయితే ఇక్కడి నుంచి వేరే జిల్లాలే కాకుండా రాష్ట్రాలకు కూడా ఎగుమతి జరుగు తుంటాయి. కొన్ని ఫరంలు అయితే బ్యాంకు రుణాలు ఎక్కువ మొత్తంలో పొందేందుకు ఆదా యం ఎక్కువగా చూపిస్తుంటాయి. జీఎస్టీ వచ్చిన తర్వాత బిల్లుల్లోనే అంతా వచ్చేస్తుంది. ఇక్కడికి వచ్చే సరుకులపై ఐజీఎస్టీ జోడించి వస్తుంది. ఇక్కడ నుంచి విక్రయించే వాటిపైనా ఎస్‌జీఎస్‌టీ పడుతుంది. సర్వీసు సెక్టార్ లోనూ జీఎస్‌టీ వసూలు చేస్తారు. సేవా రంగంలో 18 శాతం వరకు జీఎస్‌టీ ఉంటుంది. కొన్ని సరుకులపై ఐదు శాతం పైగానే జీఎస్‌టీ వసూలు చేస్తారు.

వసూళ్లు తగ్గడంతో..

ఎలక్ట్రానిక్ విధానంలో ఇన్‌వాయిస్, వేబిల్లులు వచ్చిన తర్వాత చాలా వరకు వసూళ్లు తగ్గిపోవడంతో ఇప్పుడు జీఎస్‌టీ అధికారుల కన్ను స్క్రూటినీలపై పడింది. తొలుత ఆ శాఖలోని కింది స్థాయి ఉద్యోగి ఫోన్ చేసి.. వారి ఫరంపై పెద్ద స్క్రూటినీ పడబోతుందని, ఫలాన ప్రాంతానికి వచ్చి సెటిల్ చేసుకోమని చెబుతాడు. ఇటీవల కాలంలో పట్నంబజారు పరిసర ప్రాంతాల్లో ఇద్దరు వ్యాపారవేత్తలకు ఇలానే ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఈ క్రమంలో ఫలాన నంబరుకు డబ్బులు పంపించమంటున్నారు. ఎవరైతే వాళ్ల దారిలోకి రారో అప్పుడు స్క్రూటినీ వేస్తున్నారు. ఇక్కడ ఆర్‌సీ ఉన్న వాళ్లకి వేరే ఊరికి రమ్మంటారు. కొన్ని సందర్భాల్లో పదేళ్ల క్రితం జరిగిన లావాదేవీలకు సంబంధించిన పత్రాలు కూడా అడుగుతున్నారు. ఈ స్క్రూటినీని ఒక పట్టాన తెగతెంచరు. ఆ వ్యాపారి తమ వద్దకు వచ్చేలా చేసుకొనేందుకు రెండు నెలలకు పైగానే ఫలాన ఇన్‌వాయిస్ తేడాగా ఉంది. అది తీసుకుర మ్మంటూ ఫోన్లు చేస్తుంటారు. మొత్తం ఆ వ్యాపారి ఎంత రేటుకు సరుకులు కొనుగోలు చేశారు, ఎంతకు విక్రయించారు, ఆదాయం ఎంత వచ్చిందనేది తేలుస్తారు. రూ. కోటి ఆదాయం వచ్చిందంటే 10 శాతం వరకు నగదు డిమాండ్ చేస్తారు. ఈ క్రమంలో కొంతమంది అకౌంటెంట్‌లు దళారీ పాత్ర పోషించి అంత ఇచ్చుకోలేడని చెప్పి కొంత తగ్గించమంటారు. ఇలా ఒక అంకెని ఖరారు చేసి ఎవరికి వాళ్లు పంచుకొంటారు. కొంతమంది అధికారులతో బాగా పరిచయం ఉన్న వాళ్లు కూడా ఈ వ్యవహారంలో బాగానే లాభ పడుతున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.33.50లక్షల విలువైన బంగారు, వెండి స్వాధీనం

నరసరావుపేట లీగల్, జూన్ 5, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పరిధిలో కొంతకాలంగా ఏడు చోరీలకు పాల్పడిన ప్రకాశం జిల్లా దర్శి మండలం పోతవరం గ్రామానికి చెందిన నిందితుడు నాగమల్లేశ్వరరావును గురువారం అరెస్టు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడి నుండి రూ.33.50 లక్షల విలువైన 380 గ్రాముల బంగారం, ఆరు కేజీల వెండి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నిందితుడు మద్యం, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడినట్లు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఉగ్ర ఆదినారాయణను రూ.9 లక్షలు అప్పు ఇవ్వకపోవడంతో.. నాగమల్లేశ్వరరావు 2018లో నిందితుడు రాజశేఖర్‌రెడ్డి, సురేష్, మన్యం కోటేశ్వరరావుతో కిడ్నాప్ చేసి అద్దంకి తీసుకొచ్చి హతమార్చినట్లు దర్శి పోలీస్ స్టేషన్లో కేసు నమోదయిందని తెలిపారు. నిందితుడు బెయిల్‌పై వచ్చి పల్నాడు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా ఇనుప రాడ్డుతో బీరువాలను పగలగొట్టి బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లేవాడని తెలిపారు. గతేడాది ఫిబ్రవరి 1న మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో మెయిన్‌రోడ్డులో ఉన్న ఇంటిలో 350 గ్రాముల బంగారం, వెండి దొంగలించాడని వెల్లడించారు. వాటిని అమ్మడానికి తీసుకెళ్తుండగా.. గురువారం ఉదయం 10 గంటల సమయంలో మండలంలోని రావిపాడు గ్రామ శివారులో రూరల్ సీఐ రామకృష్ణ అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐలు రామకృష్ణ, చిలుకూరుపేట సుబ్బారాయుడు, ఎస్సైలు అనిల్ కుమార్, కిషోర్, అశోక్, ఫాతిమాల నేతృత్వంలో క్రైమ్ పార్టీ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం చాకచక్యంగా నిందితుడిని అరెస్ట్ చేయడం లో ప్రతిభ కనపరిచారు. వీరిని అభినందించి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు రివార్డులు ప్రకటించారు.

సిబ్బందికి అభినందనలు..

పల్నాడు జిల్లా పోలీసులు కేసులను అత్యంత పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి.. పటిష్టంగా అభియోగపత్రాలు దాఖలు చేసి ఎనిమిది నెలల వ్యవధిలో నిందితులపై సమర్థంగా నేరాలు నిరూపించారు. ఆరు కేసుల్లో జీవిత ఖైదు, ఒక కేసులో మరణశిక్ష, ఒక పోక్సో కేసులో సుదీర్ఘ జైలు శిక్ష విధించేలా పోలీసులు కోర్టు మానిటరింగ్ సిస్టంతో కృషి చేశారని అభినందించారు. నరసరావుపేట, గురజాల డీఎస్పీలు నాగేశ్వరరావు జగదీష్ పాల్గొన్నారు.

రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన 15 గ్రామాలకు చెందిన 116 మంది రైతులకు గురువారం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 294 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 197 నివాస ప్లాట్లు కాగా 97 వాణిజ్య పాట్లు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక గ్రామ రైతులకు ఈ లాటరీ నిర్వహించగా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1, 2, కొండమరాజుపాలెం, శాఖమూరు, వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, పిచ్చుకలపాలెం గ్రామ రైతులకు ఈ లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించడం జరిగింది. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందజేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్) ఎన్‌ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుం వసూలు చేయబడదన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

పెదకాకాని, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం అన్నారు. ప్రపంచ పర్యా వరణ దినోత్సవ సంద ర్భంగా పర్యావరణ విభా గం ఆధ్వర్యంలో గురు వారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్త ప్రాణ కోటికి నష్టం కలిగించే భూతాపాన్ని అరి కట్టడానికి మొక్కలు నాట డం ఒక్కటే పరిష్కారమని తెలిపారు. అనంతరం ప ర్యావరణ విభాగం ఎద ు రుగా ఉన్న ఖాళీ స్థలంలో వివిధ దేశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులతో కల సి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ విభాగాధిపతి ఆచార్య ఏవీ వీఎస్ స్వామి, ఛైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఆచార్య బ్రహ్మ జీరావు, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఆత్మహత్య

భార్యతో విభేదాలతోనే మౌలాలీ ఆత్మహత్య

అద్దంకి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్ వద్ద సరివితోటలోని మృతదేహం ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ మందుల మౌలాలీ(27)గా పోలీసులు గుర్తించారు. సీఐ సుబ్బరాజు కథనం మేరకు.. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్లకు చెందిన మందుల మౌలాలి వెంకటగిరి ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2024లో గుంటూరుకు చెందిన ఫాతిమాతో వివాహం జరిగింది. వివాహం జరిగిన తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఫాతిమా గుంటూరులోనే ఉంటుంది. వెంకటగిరి వెళ్తున్నానని మౌలాలీ ఆదివారం విప్పర్లలోని కుటుంబసభ్యులకు చెప్పి స్కూటీపై బయలుదేరాడు. అద్దంకి మండలం శాంతినగర్ వద్దకు సాయంత్రం సమయంలో వచ్చి స్కూటీని నామ్ రోడ్డు వెంబడి ఉన్న బడ్డీ కొట్టు వద్ద ఆపి సమీపంలోని తోట లోపలకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం తోటలోని చెట్టుకు వెలాడుతన్న మృతదేహాన్ని గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. అనంతరం స్కూటీని గుర్తించి అందులో ఉన్న పత్రాల ఆధారంగా మృతుడు మౌలాలిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. భార్యతో విభేదాలతో మౌలాలీ ఆత్మహత్యకు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రకృతితో సామరస్యంగా జీవించాలి

● జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయికల్యాణ్ చక్రవర్తి



మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయికల్యాణ్ చక్రవర్తి

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రపంచంలో జీవించే హక్కు ప్రతీ జీవికి ఉన్నది.. మానవులు ఇతర జీవుల హక్కులను గౌరవిస్తూ ప్రకృతితో సామరస్యంగా జీవించాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి బీ సాయికల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలూష్యాన్ని నిర్మూలిద్దాం అనే నినాదంతో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులు, జంతువులు చనిపోతున్నాయన్నారు. అందరూ ప్రకృతిని ప్రేమిస్తూ, పరిరక్షిస్తూ జీవించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీపీసీబీ ఈఈ ఎండీ నజీనబేగం మాట్లాడుతూ ప్లాసిక్ వినియోగం వల్ల ఆరోగ్య సమస్య లు తలెత్తుతున్నాయని చెప్పారు. భూమి, నీరు, జీవ వైవిద్యంపై దుష్ప్రభావాలు చోటు చేసుకుంటాయ న్నారు. పిల్లలకి చిన్ననాటి నుంచి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను గురించి బోధించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈఈ ఆదిశేషయ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఇష్రత్‌ఫాతిమా, నగరపాలక సంస్థ సీఎంవో అమృత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివసూర్యనారాయణ, ప్యానల్ అడ్వకెటు కాళిదాసు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల

పెదకాకాని, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ ఏడాది మేలో జరిగిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం గురువారం విడుదల చేశారు. బీఏ, బీకాం, బీబీఎ ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 6220 మంది విద్యార్థులు హాజరు కాగా 6143 మంది ఉత్తీర్ణ సాధించారు. కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు. పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్, డిప్యూటీ రిజిస్టర్ సయ్యద్ జైలుద్దీన్, అసిస్టెంట్ రిజిస్టర్ కృష్ణవేణి, సూపరింటెండెంట్ జె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

వైభవంగా ముగిసిన బాబా వారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ, శ్రీ షిరిడి సాయినాథ మందిరంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. గురువారం ఉదయం బాబా వారికి కాకడ హారతి, పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు మామిడి సీతారామయ్య దంపతులు సాయినాథునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం బాబా వారికి లక్ష మల్లెలార్చన జరిపారు. కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరయ్యారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చైర్మన్ వడ్రాణం మార్కండేయ బాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

● జనపనార సంచులను వినియోగించాలి
● పర్యావరణ దినోత్సవంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకుని, ప్రత్యామ్నాయంగా వస్త్ర, జనపనార సంచులను వినియోగించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి ర్యాలీ, మాస్‌క్లీనింగ్, జీఎంసీ పార్కింగ్ ప్రాంతంలో మొక్కలు నాటారు. ప్రజారోగ్య కార్మికులకు వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రజలకు ఐటీసీ వారు అందించిన సంచులను పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛ హరితాంధ్ర కోసం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. గాంధీ పార్క్ వద్ద రూ.20లకు సంచులను ఇచ్చే కియాస్క్ మెషిన్‌ని, ప్లాస్టిక్, ఈ-వేస్ట్ కలెక్షన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలు బాధ్యతగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ 1 కేజీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అడ్డుకోవడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని, తాగునీటి, భూగర్భ జలాల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నో ప్లాస్టిక్ యూజ్ అనే నినాదాన్ని ప్రజలు అమలు చేయాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సమాజం నుంచి పూర్తిగా తొలగించుకోవడానికి ప్రజలు సహకరించాలన్నారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ మానవాళి ఆరోగ్యానికి ప్లాస్టిక్ వినియోగం ప్రమాదంగా మారిందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను వ్యక్తిగత బాధ్యతగా తీసుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఏసీ చల్లా ఓబులేసు, చెలికాని సీతారామయ్య, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, మేయర్ నాని, ప్రభాకర్ తదితరులు

కార్మికులు విధుల్లో రక్షణ పరికరాలు ధరించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. గురువారం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే)లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యూజీడి), సెప్టిక్ ట్యాంక్ లను శుభ్రపరిచే కార్మికులకు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యూజిడి, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులు ప్రమాదకర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. నమస్తే పథకం ద్వారా గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో యూజిడి కార్మికులకు పీపీఈ కిట్లు అందించామని, ఇంకా ఎవరికైనా కావాలంటే వివరాలతో జిఎంసి ప్రజారోగ్య విభాగంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సుందర్రామిరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుండి అనిల్, వినయ్, జిఎంసి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు



హాస్టల్ భవనం గురించి ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సమీకృత హాస్టల్ భవనాన్ని సత్వరం ప్రారంభించాలి

● ఎమ్మెల్యే నసీర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు (విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న సమీకృత హాస్టల్ భవనాన్ని సత్వరం వినియోగంలోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విజ్ఞప్తి చేశారు ఈ మేరకు గురువారం తూర్పు ఎమ్మెల్యే ఎండీ నజీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ హాస్టల్ వినియోగంలోకి వస్తే ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. వెంటనే భవనం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, నగర కార్యదర్శి ఏ యశ్వంత్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ మరుగుదొడ్లను ప్రారంభించిన మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

బహిరంగ మలమూత్ర విసర్జన ప్రజారోగ్యానికి భంగం

● మేయర్, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బహిరంగ మలమూత్ర విసర్జన ప్రజారోగ్యానికి భంగమని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో ఇమ్మానియేలు పేటలో నిర్మించిన కమ్యూనిటీ టాయ్‌లెట్స్‌ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు అధికంగా ఉండే ఇమ్మానుయేలు పేటలో ఐటీసీ బంగారు భవిష్యత్ వారు కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐటీసీ హెచ్‌ఆర్ మేనేజర్ పవన్, ఎంఎస్కే పీఎం గౌరీ నాయుడు, నారాయణ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళిక ను విడుదల చేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి

20వేల మందికి పీఎం సూర్యఘర్ రుణాలు

● అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణం
● బ్యాంకర్లకు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆదేశం

గుంటూరు సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం కింద ఈ ఏడాది 20 వేల మందికి రుణాలు ఇవ్వాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్ తేజ అన్నారు. ఖరీఫ్‌లో అర్హత గల ప్రతి రైతుకు రుణాలు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం జిల్లాలోని బ్యాంకర్లతో ఆయన వార్షిక ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది కౌలు రైతులకు రూ.180 కోట్ల రుణం మంజూరు చేయాలని లక్ష్యంగా ఉండగా, రూ. 60కోట్లు మాత్రమే మంజూరుచేశారన్నారు. ఈ ఏడాది అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణం అందేలా చూడాల్సిన బాధ్యత లీడ్ బ్యాంకుపై ఉందన్నారు. 2024-25 సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.13,613కోట్ల రుణ లక్ష్యానికిగాను, రూ.16,266 కోట్లు మంజూరు చేయటం హర్షించదగిన విషయమన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.9,495 కోట్లు రుణ లక్ష్యం కాగా, రూ.10,679 కోట్లు మంజూరు చేశారని, విద్యారుణాలు కూడా లక్ష్యాన్ని మించి మంజూరు చేయటం గొప్ప సంగతన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ జవహర్, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, ఆర్‌బీఐ ఎల్‌డీఓ నవీన్, నాబార్డ్ డీడీ ఎం శరత్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నల్లపాడులోని రైల్వే ఫ్రైట్ డిపోలో మొక్కలు నాటుతున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

రైల్వేస్టేషన్లలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

● డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆదేశించారు. అలానే స్టేషన్లలో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుంటూరు రైల్వేస్టేషన్, నల్లపాడు రైల్వే ఫ్రైట్ డిపోలో పలు కార్యక్రమాలు జరిగాయి. రైల్వేస్టేషన్‌లో నాటక ప్రదర్శన, రైల్వే అధికారులు, ప్రయాణీకులతో ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. నల్లపాడు ఫ్రైట్ డిపోలో డీఆర్ఎంతో పాటు ఇతర సీనియర్ అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతీ ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. పర్యావరణ హిత అలవాట్లను ప్రతీ ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే సైమన్, సీనియర్ అధికారులు జేవీ అనూష, ఎం రవికిరణ్, డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, జే శ్రీనాథ్, జీ రత్నాకర్, మధుసూదనరావు, జీ సూర్యనారాయణ్, పీ రవితేజ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ పాల్గొన్న బీజేపీ నాయకులు

పచ్చదనాన్ని పెంపొందించాలి

గుంటూరు(తూర్పు), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేలా ప్రజలు చొరవ చూపాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విద్యానగర్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన అమ్మ పేరుతో ఓ మొక్క కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందజేయడం మనందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, కోలా రేణుకాదేవి, తోట శ్రీనివాసరావు, భజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మలబార్ మైన్ డైమండ్స్ షో



మైన్ డైమండ్స్ షోను ప్రారంభిస్తున్న వైద్యులు పాలకుర్తి శ్రీస్నేహ, రోహిత, పెద్ది రమణరావు తదితరులు

గుంటూరు(తూర్పు), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూం వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మైన్ డైమండ్స్ షో పేరిట వజ్రాభరణాల ప్రదర్శన గురువారం ఘనంగా ప్రారంభమయ్యింది. ప్రముఖ వైద్యులు పాలకుర్తి శ్రీ స్నేహ, రోహిత, పెద్ది రమణరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్టోర్ హెడ్ నదిర్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో పది శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చని అన్నారు. బుకింగ్ చేసిన రోజు ధర కంటే తక్కువగా ఉంటే ఆ ధరను చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, జితిన్, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ వీ శంకర్

డ్వామా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

గుంటూరు సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలలోను మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వీ శంకర్ అమ్మ పేరుతో మొక్క అనే ఇతివృత్తంతో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారం భించారు. చినపలకలూరు, పేరేచర్ల గ్రామాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా నిర్మించిన పంట కుంటల గట్లపైన, పొలాల గట్ల మీద, విద్యాసంస్థలలోను, రోడ్ల వెంట పలు రకాల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. సుమారు 11 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది, శ్రామికులతో శంకర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించటానికి ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత మండలాల ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

చిప్స్‌లో ఘనంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

గుంటూరు (విద్య). జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)లో గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర సూర్యదేవర విద్యాధర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం యువత కృషి చేయాలని, మొక్కలని విస్తృతంగా పెంచి వాతావరణ కాలుష్యం నుంచి రక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మసీ విద్యార్థులు ఔషధ మొక్కల ప్రయోజనాలను తెలుసుకొని విస్తృత ప్రచారం చేయాలన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సూర్యదేవర విద్యాధర



బహుమతులు పొందిన క్రీడాకారులతో గుంటూరు క్లబ్ సభ్యులు

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

గుంటూరు(తూర్పు), జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు క్లబ్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా సాగిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. శిబిరంలో దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొని, అయా క్రీడలపై శిక్షణ తీసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ జగదీష్, ఎన్ సాంబశివరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీపీఐ నాయకులు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అశోక్‌నగర్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, ఆకిటి రామచంద్రుడు, పర్యావరణ ప్రాజెక్ట్ ఆఫీసర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్, నాన్ పీహెచ్ ఉద్యోగుల జీతాలు సమం చేయాలి

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు సమాన వేతనం అమలు చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు కోరారు. ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమస్యలపై ఆయన గురువారం మాట్లాడారు. 2019కి ముందు పీహెచ్, నాన్‌పీహెచ్ ఉద్యోగులకు సమాన వేతనం ఉండేదని, దాన్ని 2023-24 సంవత్సరంలో వేరుచేసి వేతనాలు అసమానంగా పెంచారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అందరికీ వేతనాలు పెంచి న్యాయం చేయాలని ఆయన కోరారు.



సమావేశాలు మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థి స్థాయిలోనే చైతన్యం రావాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. గురువారం బ్రాడీపేట లోని యూటీఎఫ్ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ భూమి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మొక్కలను పెంచాలని సూచించారు కార్యక్రమంలో జేవీవీ నాయకులు బీ ప్రసాద్, టీఆర్ రమేష్, టీ జాన్ బాబు, ఎస్ఎం సుభాని, ఆర్ స్వాతి పాల్గొన్నారు.

కనుల పండువగా అష్టోత్తర శత కలశాభిషేకం

గుంటూరు(తూర్పు), జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్, శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత అర్చక బృందం ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో విశేషంగా అలంకరించిన వేదికపైకి మేళతాళాలతో చేర్చారు. అనంతరం విశ్వక్ సేనారాధన, కలశారాధన, స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో, అష్టోత్తర శత కలశాభిషేకం వేద మంత్రాల నడుమ ప్రజల సంక్షేమం, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ నిర్వహించారు. విశేష హారతి ఇచ్చారు. కార్యక్రమాల్ని దనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.



స్వామి వారికి శత కలశాభిషేకం చేస్తున్న అర్చకులు

హెడ్ నర్సులుగా 16 మందికి ఉద్యోగోన్నతి

గుంటూరు మెడికల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ గుంటూరు ప్రాంతీయ సంచాలకుల కార్యాలయ పరిధిలో 16 మంది స్టాఫ్ నర్సులకు హెడ్ నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కె.సుచిత్ర ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం పాతగుంటూరులోని ఆర్‌డీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ కు జోన్ పరిధిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి 16 మంది స్టాఫ్ నర్సులు హాజరయ్యారు. ప్రమోషన్ పొందిన హెడ్ నర్సుల్లో ఎనిమిది మందిని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పతిలో, ఐదుగురిని ఒంగోలులోని రిమ్స్‌కు, ముగ్గురిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో నియమించారు. ఆరు నెలలుగా ప్రమోషన్ల కోసం నర్సులు ఎదు రు చూస్తున్నారు. పారదర్శకంగా కౌన్సె లింగ్‌ను నిర్వహించిన ఆర్‌డీ డాక్టర్ సుచిత్రకు, కార్యాల య అధికారుల కు ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా శాఖ ప్రతిని ధులు యల్లంపల్లి పద్మజ, పి.హేమలత, జి.శ్రీదేవి, ఎం ఆశాలత, పి.సునీత, ఎ.భూలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్డీ సుచిత్ర నుంచి ఉద్యోగోన్నతి పత్రం అందుకుంటున్న నర్సులు

డేటా లేదు!

● వెబ్ ల్యాండ్‌లో ఓకే.. వీవీఏ లాగిన్‌లో మిస్సింగ్

● అన్నదాత సుఖీభవ లబ్ధిపై ఆందోళన

నకరికల్లు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ యోజనకు దరఖాస్తు చేసుకొనే రైతులకు రైతు సేవా కేంద్రాల్లో సంబంధిత తమ డేటా కన్పించకపోవడం ఇబ్బందికరంగా మారింది. తహసీల్దార్ కార్యాలయాల్లోని వెబ్ ల్యాండ్ డేటాలో అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ.. ఆ డేటా రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏ లాగిన్‌లో కన్పించడం లేదని చెబుతున్నారు. తమ సమస్యను ఎవరు పరిష్కరిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. వెబ్ ల్యాండ్‌లో తప్పులు దొర్లిన పత్రాలను రైతు సేవా కేంద్రాల నుంచి నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి పంపి.. తిరిగి ఆన్‌లైన్‌లో వీఏఏ లాగిన్‌కు పంపుతున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సమస్యకు పరిష్కారం చూపండి

సాంకేతికపరంగా విలేజ్ అగ్రికల్చర్ లాగిన్‌లో రాష్ట్రంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ సమస్య ఉంది. వెబ్ ల్యాండ్‌లో అన్ని సక్రమంగా ఉన్నా వీఏఏ లాగిన్‌లో తమ వివరాలు లేవని వ్యవసాయ సహాయకులు తెలియజేయడంతో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు తమకు వర్తిస్తాయో లేవో నని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళన వద్దు: జిల్లా వ్యవసాయ అధికారి మురళీ

వీఏఏ లాగిన్‌లో కన్పించని రైతుల వివరాలను మండలాల వారీగా సేకరించి వ్యవసాయ కమిషనరేట్‌కు పంపేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతుల ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తుంది.

ఉండవల్లి గుహల చిత్రంతో.. పోస్టు కార్డు విడుదల



పోస్టు కార్డులను ప్రదర్శిస్తున్న పోస్టల్ అధికారులు

తాడేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత ఉండవల్లి గుహలకు భారతీయ పోస్టల్ శాఖ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా తాడేపల్లి మండల పరిధిలో ఉన్న ఉండవల్లి గుహల వద్ద గురువారం పోస్టల్ అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి గుహల చిత్రంతో కూడిన పోస్టు కార్డును విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోస్ట్ మాస్టర్ జనరల్ డీవీఎస్ఆర్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంక్లిష్ నేత, సూపరింటెండెంట్ ఆఫ్ ఆర్కియాలజీ దేవేంద్రనాథ్ బోయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. పోస్టుకార్డుపై ఉన్న ముద్ర ఉండవల్లి గుహల ప్రాముఖ్యతను తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ గుంటూరు డివిజన్ యలమందయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మంగళగిరి రాధాకృష్ణమూర్తి, తాడేపల్లి సబ్‌పోస్ట్ మాస్టర్ ఏడుకొండలు, పోస్టల్ సిబ్బంది సన్నీ, వంశీ, కృష్ణారెడ్డి, గోపి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హాట్ టాపిక్‌గా.. గుంటూరు ఏఓ పోస్టు

ఐదేళ్లు కాకున్నా బదిలీ కోసం పట్టు

గుంటూరు సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పోస్టు కోసం మినీ యుద్ధమే జరుగుతోంది. ఆ పోస్టులోకి వచ్చేందుకు కొందరు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు అత్యంత వివాదాస్పదంగా మారాయి. ఈ పరిణామాలపై వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు దృష్టిసారించారు. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ దాటిన వారిని కచ్చితంగా బదిలీ చేయాలని జీఓలో పేర్కొన్నారు. రెండేళ్ల సర్వీస్ దాటిన వాళ్ల కూడా రిక్వస్టు బదిలీకి అర్హులని నిబంధన రూపొందించారు. వ్యవసాయ శాఖ జోన్ -3 పరిధిలోకి వచ్చే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పోస్టులు మూడు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌కు మాత్రమే ఐదేళ్ల సర్వీస్ కాలం పూర్తి అయ్యింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్లకు బదిలీ కోసం నిర్ణయించిన సర్వీస్ ఇంకా పూర్తి కాలేదు. కానీ, నెల్లూరు లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ మాత్రం తనకు గుంటూరులో పోస్టింగ్ కావాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారిని ఆ పోస్టు లో నియమించాలంటే గుంటూరులో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌ను బదిలీ చేయాలి. అందుకు నిబంధనలు ఒప్పుకోవు. సర్వీస్ కాలం పూర్తి కానందున సదరు అధికారిని బదిలీ చేసే అవకాశం లేదని వ్యవసాయ అధికారులు అంటున్నారు. నెల్లూరుకు చెందిన అధికారి మాత్రం తనకు గుంటూరు అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ పోస్టు మాత్రమే కావాలని పట్టు పడుతూ ఉండటం చర్చనీయాంశంగా మారింది. అదే పోస్టులో ఉన్న మరో అధికారి బదిలీ కాకుండా ఖాళీ చూపించడం సాధ్యం కాదని ఉన్నత అధికారులు అంటున్నారు. వాస్తవాలు ఇలా ఉంటే సదరు అధికారి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ను కలిసినట్లు ప్రచారం ప్రారంభం అయ్యింది. ఈ బదిలీ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా తాము ఏమీ చేయలేమని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

బ్యాంకు అక్రమార్కులను వదిలిపెట్టేది లేదు

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

● జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు బాధ్యతల స్వీకారం


చైర్మన్ మల్లికార్జునరావును అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


చైర్మన్ మక్కెనకు అభినందనలు తెలుపుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జంగా కృష్ణమూర్తి

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సమక్షంలో గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి అచెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ హయాంలో జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో రూ.కోట్ల అక్రమాలు జరిగాయని మండిపడ్డారు. దీనిపై అసెంబ్లీ స్థాయిలో సభా సంఘం వేశామన్నారు. అక్రమాలపై ఇప్పటికే నివేదిక కూడా వచ్చిందని , అక్రమార్కులపై క్రిమినల్ చర్యలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఎవరికి రుణాలిచ్చారో, ఎలా ఇచ్చారో, ఎంత ఇచ్చారో కూడా లెక్కల్లేని పరిస్థితులున్నాయని మండిపడ్డారు. ఈ దఫా కౌలు రైతులకు కూడా సెంట్రల్ బ్యాంకు ద్వారా రుణాలు అందించేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీలైనంత త్వరలో ఎన్నికలు జరిపి సహకార వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రాథమిక పరమితి సంఘాలు, సెంట్రల్ బ్యాంకులను కంప్యూటీకరణ జరుపుతున్నామని, ఈ నెల నుంచే అన్నీ ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. త్వరలోనే పీఏసీఎస్‌లకు కూడా త్రీమెన్ కమిటీ వేస్తామన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన మక్కెన మల్లికార్జునరావు ఈ పదవికి వన్నె తెస్తారన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ తాను రైతు బిడ్డనేనని, రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తానన్నారు. గతంలో జరిగిన అక్రమాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, ఎంతటి వారినైనా వదిలేదిలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, చదలవాడ అరవిందబాబు, ఎండీ నసీర్ అహ్మద్, గళ్ళా మాధవి, ధూళిపాళ్ళ నరేంద్ర, భాష్యం ప్రవీణ్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీలు రాయపాటి శ్రీనివాస్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, నన్నపనేని రాజకుమారి, టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావులు, మక్కెన మల్లికార్జునరావుకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాడీపేటలోని బ్యాంకు ఆవరణలో మంత్రి అచ్చెన్నాయుడు మొక్కను నాటారు.

రైతు బిడ్డగా సేవ చేస్తా

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

● బాధ్యతల స్వీకారం, పలువురి అభినందనలు


చైర్మన్ హరిబాబుకు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతు బిడ్డగా అవకాశం దక్కిందని, డీసీఎంఎస్ చైర్మన్‌గా రైతులకు సేవ చేస్తా అని వడ్రాణం హరిబాబు పేర్కొన్నారు. గుంటూరు కోర్టు రోడ్డులో ఉన్న జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌గా హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వడ్రాణం హరిబాబుకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు తెలియజేశారు. రైతులకు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు గిట్టుబాటు ధరలకు అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. రైతన్నకు అన్ని సందర్భాల్లో అండగా నిలుస్తానన్నారు. సంస్థకు జాగర్లమూడి చంద్రమౌళి వంటి ఎందరో పెద్దలు చైర్మన్లుగా వ్యవహరించారని, వారి పేరు ప్రఖ్యాతలకు మరింత వన్నె తెచ్చేలా పనిచేస్తానన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ తొలి నుంచి కష్టించే మనస్తత్వం వడ్రాణం హరిబాబుదన్నారు. పార్టీ కోసం పనిచేసిన ఆయనకు ప్రతిష్టాత్మకమైన డీసీఎంఎస్ చైర్మన్ పదవి కట్టబెట్టడం ముదావహమన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పుష్పగుచ్ఛంతో హరిబాబుకు అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు పాటిబండ్ల నాగేశ్వరరావు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్తీ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైఎస్ జగన్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, జూన్ 5: కల్తీ రాజకీయాలకు జగన్ అడ్రస్‌గా మారారని ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ గురువారం విమర్శించారు. నాసిరకం మద్యం కంపెనీలు, మద్యం అమ్మకాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారన్నారు. మద్యం దుకాణాలలో డిజిటల్ చెల్లింపులు చేయనియకుండా కోట్లాది రూపాయలు పక్కదారి పట్టించారని విమర్శించారు. ప్రభుత్వం మద్యం డిపోలను 15 ఏళ్లకు తాకట్టు పెట్టిన ఘనత వైసీపీ పాలకులదేనన్నారు. వందల కేజీల బంగారం, ముడుపుల రూపంలో స్వీకరించారని ఆ ముడుపుల నగదును గత ఎన్నికలలో వైసీపీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చులకు వినియోగించారని ఆరోపించారు. ఒక్క మద్యం అమ్మకాల్లోనే ఇన్ని అక్రమ దోపిడీలు బయట పడుతున్నాయన్నారు. కల్తీ మద్యం కాసుల వెనుక అనేక మంది వైసీపీ కీలక నేతలు ఉన్నారని అనుమానాలు వ్యక్తం చేశారు. ఓడించిన ప్రజల మీద అక్కసుతో ఉన్మాదులను ఉసిగొలిపి వైసీపీ అధ్యక్షుడు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లి సేద తీరుతున్నారన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు


ధర్నాలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, పాల్గొన్న పొగాకు రైతులు

గుంటూరు(తూర్పు), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. తక్షణమే బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గురువారం గుంటూరు విద్యానగర్ జీపీఐ పొగాకు కంపెనీ ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. బర్లీ పొగాకు కొనుగోళ్లపై రైతులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంలో ఉన్నారని పేర్కొన్నారు. పంట తాము కొనుగోలు చేస్తామంటూ రైతులకు సంతకం లేని బాండ్లు ఇచ్చిన కంపెనీలు ఇప్పుడు మొహం చాటేశాయన్నారు. నల్ల, తెల్ల బర్లీ పొగాకు ఇప్పటి వరకు కేవలం 4 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారని, సాగులో ఇది కేవలం 10 శాతం మాత్రమేనని తెలిపారు. నెల రోజులుగా జరుగుతున్న ఆందోళనల కారణంగానే ఈ కొనుగోళ్లు జరిగాయని చెప్పారు. జీపీఐ సంస్థ 10 మిలియన్ కేజీలు కొనుగోలు చేస్తామని రైతులకు బాండ్లు ఇచ్చి.. కేవలం రెండు మిలియన్ కేజీలు కొనుగోలు చేసి తప్పుకుందని విమర్శించారు. ఈ నెల 10 నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటనను స్వాగతిస్తున్నామని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ త్వరలో ప్రారంభించే కొనుగోళ్లలో దళారులు ప్రమేయం లేకుండా చూడాలని కోరారు. తొలుత సన్నకారు, కౌలు రైతుల వద్ద ఉన్న అలాగే గతంలో తిరస్కరించిన పొగాకు కూడా కొనుగోలు చేయాలన్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులకు వినతి పత్రం అందజేశారు. రైతులకు ఇచ్చిన బాండ్ల మేరకు పొగాకును కొనుగోలు చేస్తామని ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు రైతు సంఘ నాయకులు తెలిపారు. నిరసనలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి, వై.రాధాకృష్ణమూర్తి, రంగారావు, కంచుమాటి అజయ్, నరసింహారావు, నాగేశ్వరరావు, నల్లమడ రైతు సంఘ నాయకుడు కొల్ల రాజమోహన్, పలు జిల్లాల రైతులు పాల్గొన్నారు.

‘మక్కెన’ను సన్మానించిన జడ్పీ చైర్‌పర్సన్



గుంటూరు సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మక్కెన మల్లికార్జునరావును జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సన్మానించారు. గురువారం సాయంత్రం బ్రాడీపేటలోని జీడీ సీసీ ప్రధాన కార్యాలయంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో మక్కెనకు శుభాకాంక్షలు తెలిపారు. రైతు బిడ్డకు ఉన్నత పదవి దక్కడం గొప్ప విషయమన్నారు.

ఎం ఆధార్ యాప్‌తో.. రైల్వే ప్రయాణికుల గుర్తింపు ధ్రువీకరణ

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇతర దేశాల నుంచి అక్రమంగా చొరబడి నకిలీ ఆధార్ కార్డుతో ఉంటున్న వారి ఏరివేతకు తన వంతు పాత్ర పోషించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా గురువారం రైల్వేబోర్డు డైరెక్టర్ ప్యాసింజర్ మార్కెటింగ్(కోఆర్డినేషన్) ప్రవీణ్‌కుమార్ నుంచి అన్ని రైల్వే జోన్ల ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఉత్తరాది రాష్ట్రాల్లో కొంతమందిని తనిఖీ చేయగా వేల సంఖ్యలో బంగ్లాదేశీయులు ఉంటున్నట్లు తేలింది. వాళ్లంతా నకిలీ ఆధార్ కార్డులు కలిగిఉన్నారు. వాటిని వినియోగించి దేశమంతటా సంచరిస్తూ ఉద్యోగాలు పొందుతున్నారు. ఈ విషయం రైల్వేబోర్డు దృష్టికి వెళ్లడంతో భారతీయుల వలే వేషధారణ కలిగి ఉన్న విదేశీయులకు చెక్ పెట్టాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల గుర్తింపుని పకడ్బందీగా తనిఖీ చేసేందుకు అవసరమైన యంత్రాంగాలను వినియోగించుకోవాలని జోన్లకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా టీసీ సిబ్బంది తప్పనిసరిగా కొంతమంది ప్యాసింజర్ ఐడీలను ప్రతీ ట్రిప్‌లో తనిఖీ చేసేలా చూడాలని స్పష్టం చేశారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) అభివృద్ధి చేసిన ఎం ఆధార్ ప్రయాణికుల ధ్రువీకరణని పరిశీలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే భావిస్తోంది. ఈ యాప్‌లో పలు రకాల ఫీచర్లు ఉన్నాయి. ముఖ్యంగా క్యూఆర్-కోడ్ ఆధారిత పరిశీలన ఉంది. ఇది ప్రయాణికుడి గుర్తింపును నిర్ధారిస్తుంది. ఆధార్ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ని ఎం ఆధార్ స్కానర్ ద్వారా స్కానింగ్ చేస్తే ఫొటో, ఆధార్ నంబరు, పేరు, జనన తేదీ, చిరునామా, లింగం వంటి వివరాలు ఫోన్‌లో కనిపిస్తాయి. ఇది రియల్ టైంలో పని చేస్తుంది. ఈ యాప్ ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ పని చేస్తుంది. ఇది ఆధార్ కార్డుని దుర్వినియోగం చేసేవారికి ముకుతాడు వేసేందుకు ఉపయోగపడుతుందని రైల్వే బోర్డు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో టిక్కెట్ చెకింగ్ సిబ్బందిని ఎం ఆధార్ యాప్‌ని డౌన్‌లోడింగ్ చేసుకొని వినియోగించడంపై అవగాహన కల్పించాలని ఆదేశించింది. ఈ యాప్‌ని త్వరలోనే హ్యాండ్ హెల్డ్ టెర్మినల్(హెచ్‌హెచ్‌టీ)లకు కూడా ఇస్తామని పేర్కొంది. రైళ్లలో పని చేసే ఆన్‌బోర్డు కాంట్రాక్టు సిబ్బంది(ఆన్‌బోర్డు హౌస్ కీపింగ్ సర్వీసు, క్యాటరింగ్)ని కూడా తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. నకిలీ ఆధార్ అని గ్రహిస్తే వెంటనే ఆర్‌పీఎఫ్/స్థానిక పోలీసులు/జీఆర్‌పీకి రిపోర్టు చేసి తగిన చర్యలు చేపట్టేలా చూడాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. రైల్వేబోర్డు ఆదేశాలతో ఇక రైళ్లలో టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డు తనిఖీలు ముమ్మరం కానున్నాయి.

రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద నిబంధనలు పాటించాలి

గుంటూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద పాదచారులు, వాహనదారులు నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని రైల్వే అధికారులు సూచించారు. గురువారం అంతర్జాతీయ రైల్వే లెవల్ క్రాసింగ్ దినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని ఎల్‌సీ గేటు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రక్షక దళం అధికారులు మాట్లాడుతూ లెవల్ క్రాసింగ్ గేటు పడిన తర్వాత ఎవరూ దాటడానికి ప్రయత్నించకూడదని తెలిపారు. అది వారి ప్రాణాలకే ప్రమాదమన్నారు. అంతేకాకుండా రైల్వే చట్టం ప్రకారం నేరమని చెప్పారు. కాపలాదారులు లేని ఎల్‌సీ గేట్ల వద్ద రెండు వైపులా చూసుకొని, రైలు రావడం లేదని నిర్ధారించుకొన్న తర్వాతనే గేటు దాటాలన్నారు. అలానే ఎల్‌సీ గేట్ల వద్ద రోడ్లపై ఉన్న డివైడర్లకు ఒకవైపునే వాహనదారులు నిరీక్షించాలని చెప్పారు. రెండు వైపులా ఉంటే గేటు తెరిచిన తర్వాత ట్రాఫిక్ స్తంభించిపోయే అవకాశం ఉందన్నారు.

జీజీహెచ్‌లో రూ.10.50 కోట్లతో.. ఆర్థో, ట్రామా బ్లాక్

● నిర్మాణానికి ముందుకొచ్చిన దక్కన్ టుబాకో సంస్థ

● నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన ప్రభుత్వం

గుంటూరు మెడికల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న రోగుల రద్దీని దృష్టిలో ఉంచుకొని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొత్తగా రూ.10.50 కోట్ల వ్యయంతో ఆర్థోపెడిక్, ట్రామా బ్లాక్‌ను నిర్మించనున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) పథకం కింద గుంటూరుకు చెందిన ప్రముఖ పొగాకు ఎగుమతి సంస్థ దక్కన్ టుబాకో ఎక్స్‌పోర్ట్ ఈ నిర్మాణానికి ముందుకు వచ్చింది. నిర్మాణ వ్యయాన్ని విరాళంగా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రతినిధులు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి లేఖ రాశారు. దీనిపై తగిన నిర్ణయం తీసుకొనేందుకు వారు ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపారు. ఈ నేపథ్యంలో సీఎస్ఆర్ పథకం కింద ప్రభుత్వాస్పత్రిలో ఆర్థో, ట్రామా బ్లాక్ నిర్మించేందుకు దక్కన్ టొబాకో సంస్థకు అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. దక్కన్ టొబాకో సంస్థే ఈ బ్లాక్ నిర్మాణం చేపడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా దక్కన్ టొబాకో ప్రతినిధులు ట్రామా బ్లాక్ నిర్మాణ పనులను కిస్వా కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు అప్పగించారు. ప్రభుత్వానికి చెందిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) భవన నిర్మాణ పనులను పర్యవేక్షించడంతో పాటు సాంకేతికపరమైన సలహాలు అందిస్తుంది. నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ ఆర్థో ట్రామా బ్లాక్‌కు దక్కన్ టుబాకో గ్రూపు కంపెనీల వ్యవస్థాపకులు దివంగత అజీజ్ ఖాన్ పేరిట నామకరణం చేస్తారు. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది.

మాచర్లలో మార్పు..

● పురపాలక సంఘంలో పూర్తిస్థాయి అధికారం టీడీపీదే

● అభివృద్ధి పనులకు ప్రణాళికలు, నిధులకు ప్రతిపాదనలు

● ఎమ్మెల్యే జూలకంటి సహకారంతో.. మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్ ముందుకు



మాచర్ల పురపాలక సంఘ కార్యాలయం చైర్మన్ మదార్ సాహెబ్

మాచర్లటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘంలో పూర్తిస్థాయి అధికారం టీడీపీకి దక్కింది. గత పురపాలక సంఘ ఎన్నికల్లో ఏకగ్రీవంగా వైసీపీ తరుపున 31 మంది కౌన్సిలర్లు ఎన్నిక కావడంతో చైర్మన్ పీఠం ఆ పార్టీ హస్తగతమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కౌన్సిలర్లు 21 మంది టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో చైర్మన్ పీఠం టీడీపీ వశమైంది. దీంతో పూర్తిస్థాయి చైర్మన్‌గా షేక్ మదార్‌సాహెబ్ ఎన్నికయ్యారు. సుదీర్ఘ కాలం రాజకీయ అనుభవం ఉన్న మదార్‌సాహెబ్ ఆధ్వర్యాన మాచర్ల పట్టణం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే జూలకంటి దుర్గాంబ సమయంలో పురపాలక సంఘ చైర్మన్ మదార్‌సాహెబ్ సోదరుడు సత్తార్‌సాహెబ్ ఎన్నికయ్యారు. ఐదేళ్లపాటు కొనసాగారు. తదుపరి అదే కుటుంబం నుంచి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మదార్‌సాహెబ్ చైర్మన్ కావడం విశేషం.

పట్టణాభివృద్ధికి ప్రణాళికలు

మాచర్ల పురపాలక సంఘం ఏర్పడ్డాక తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పట్టణాభివృద్ధి జరిగిందని చెప్పుకోవచ్చు. చంద్రవంక నదిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి, పురపాలక సంఘంలో హైలెవల్ వాటర్ ట్యాంకులు, కుడి కాలువ నుంచి మున్సిపల్ స్టోరేజీ ట్యాంకు, సపరేట్ వాటర్ లైన్సు వంటివి టీడీపీ హయాంలోనే జరిగాయి. అలాగే ప్రస్తుతం మాచర్ల పట్టణాన్ని మోడల్ మార్చేందుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రూ.54 కోట్లతో రింగురోడ్డు నుంచి రైల్వే గేటు వరకు సీసీ రోడ్లు, రైలు గేటు నుంచి శివప్రియ నగర్ బైపాస్ క్రాస్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, సైడ్ డ్రెయిన్స్, విద్యుత్ లైన్స్, వాటర్ లైన్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్య పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.136 కోట్లు మంజూరు చేయించుకోగలిగారు. ఈ పథకం ద్వారా బుగ్గ వాగు రిజర్వాయర్ నుంచి మాచర్ల పట్టణానికి రక్షిత మంచినీరు, ఫిల్టర్ హౌస్, హైలెవల్ వాటర్ ట్యాంకు, 24 గంటలు నీటి సరఫరా చేసేందుకు అవకాశముంది. అలాగే మినీ స్టేడియం, పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు భూమి కూడా సేకరించి ప్రభుత్వ అనుమతి కోసం పంపడం జరిగింది. అంతేకాకుండా పట్టణంలో అంతర్గత సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఇలా పట్టణాభివృద్ధి కోసం చైర్మన్ మదార్‌సాహెబ్ కృషి చేస్తున్నారు.

మార్కెట్లు లేక సమస్యలు

పట్టణంలో కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మటన్ మార్కెట్‌కు వసతులు సరిగా లేకపోవడంతో మాంసం విక్రయదారులు రోడ్లపైనే అమ్మకాలు నిర్వహిస్తున్నారు. చేపల మార్కెట్ కూడా అందుబాటులో లేకపోవడంతో విక్రేతలు ఎక్కడపడితే అక్కడ వీధుల వెంబడి చేపల వ్యర్థాలు వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా శ్లాటర్‌హౌస్ ఏర్పాటు చేసి మటన్ మార్కెట్‌కు సదుపాయాలు కల్పిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

రోడ్లపైనే ఫ్రూట్ మార్కెట్

పట్టణంలో ఫ్రూట్ మార్కెట్‌కు స్థలం కేటాయించకపోవడంతో తోపుడు బండ్లతో రోడ్లపై అడ్డంగా వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. చిన్నస్థాయి వ్యాపారాలు కూడా మార్కెట్ సదుపాయం లేక రోడ్లపైనే వెళ్లదీయాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే అంబులెన్స్‌కూ ఈ బండ్లు అడ్డుగా ఉండడంతో రోగులకు కూడా ఇబ్బంది కలుగక తప్పడం లేదు. ఫ్రూట్ మార్కెట్‌కు స్థలం కేటాయించి, సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

నేడు వరగానిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదనందిపాడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వరగాని సబ్ స్టేషన్ పరిధిలోని వరగాని గ్రామంలో విద్యుత్ సరఫరా నిలినివేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ కరుణాకర్ గురువారం తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్లు మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

గోవధపై సమాచారం ఇవ్వాలి

• తహసీల్దార్ వెంకటస్వామి

పెదనందిపాడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : మండలంలో గోవులను వధిస్తే గ్రామస్థులు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ బీ వెంకటస్వామి అన్నారు. బక్రీదు పండుగ సందర్భంగా మండలంలో పశువుల హింస, గోవుల అక్రమ రవాణా వంటి సంఘటనలు జరగకుండా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశార ని, పర్యవేక్షకులుగా డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లా, ఎస్‌ఐ అద్దంకి మధుపవన్, పశువైద్యాధికారి బీ స్వాతిలను నియమించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పర్యవేక్షిస్తూ ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

చేనేతలకు కూటమి చేయూత

• జిల్లా చేనేత జౌళి పరిశ్రమల శాఖ ఏడీ బీ ఉదయ్‌కుమార్

ఫిరంగిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు అనేక విధాలుగా చేయూతనిస్తుందని చేనేత, జౌళి పరిశ్రమలశాఖ జిల్లా అదనపు సంచాలకులు బీ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం ఫిరంగిపురం మహాత్మాగాంధీ వీవర్స్ సొసైటీలో జరిగిన చేనేత కార్మికుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఫిరంగిపురం నేతన్నల పనితీరు బాగుందన్నారు. కనుకనే గ్రామంలో 46 మంది నేత పని వారికి వర్క్ షెడ్ల నిర్మాణాలకై రూ. 27.60లక్షలు మంజూరయ్యాయన్నారు. భారత ప్రభుత్వం అభివృద్ధి కమిషన్ చేనేత జౌళి శాఖ న్యూఢిల్లీ ద్వారా నిధులు మంజూరయ్యాయన్నారు. మహాత్మాగాంధీ వీవర్ సొసైటీ నాన్ అఫీషియల్ పీఏసీఎస్ పసల థామస్, చేనేత జౌళి కమిషనర్ జీ రేఖారాణిల కృషి వల్లనే ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఫిరంగిపురంలోని రెండు క్లస్టర్లలో మొదటి విడత రూ.60వేలు, రెండో విడత రూ.60వేలు మంజూరు చేయనున్నామన్నారు. త్వరలోనే ప్రతి నేతన్నకు నెలకు రూ 200 విద్యుత్ యూనిట్లు ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నదన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి అధికారి శ్రీధర్‌బాబు, పసల థామస్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మేశ్వర స్వామి కళ్యాణం

వట్టిచెరుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామంలోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి వారి దేవాలయంలో గురువారం రాత్రి బ్రహ్మేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం స్వామికి మహారుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం వేద పండితులు, స్థానిక ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ స్వామి శాస్త్రోక్తంగా స్వామి వారిని పెళ్ళి కుమారుడిని చేయటం, భ్రమరాంబిక దేవి, గంగాదేవిని పెళ్ళి కుమార్తెలను చేయటం వైభవంగా సాగింది. సాయంత్రం నరనంది వాహనంపై స్వామిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మోక్షం



సీసీ రోడ్డు నిర్మాణానికి కాలువలు తీస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదనందిపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బొడ్రాయి సెంటర్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గురువారం పంచాయతీరాజ్ అధికారులు మార్కింగ్ వేయించి ప్రొక్లెయిన్‌తో కాలువలు తవ్వించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం వెలువడిన శిలాఫలకం సరే.. నిర్మాణం ఎప్పుడో.. అనే శీర్షికతో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే పనులు ప్రారంభించడంతో ఆ ప్రాంతవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

వంట గదులు, పరిసరాలు శుభ్రంగా ఉండాలి

వట్టిచెరుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాలలో పని చేసే సీసీహెచ్‌లు పాఠశాలలు తెరిచే లోపు వంట గదులు, పరిసరాలు శుభ్రం చేయటంతో పాటు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో రమేష్‌బాబు ఆదేశించారు. మండల కేంద్రం వట్టిచెరుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం మండల వ్యాప్త పాఠశాలల్లో పని చేసే సీసీహెచ్‌వోలు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణపై ఒక రోజు శిక్షణ, అలాగే వంటల తయారీపై పోటీలు నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు తెరిచేలోపు వంట గదులు, పరిసరాలు శుభ్రం చేయటంతో పాటు మెను తయారీలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి వెజ్ పలావు తయారీలో ముట్లూరు జెడ్పీ హైస్కూల్, పులిహోర, చెట్ని తయారీలో రెండో ప్రైజ్ పల్లపాడు ఎంపీపీఎస్ డబ్ల్యూ స్కూల్, మూడో బహుమతి ఎంపీపీ స్కూల్ కుర్నూతల యగ్ కర్రీ తయారీకి బహుమతులను పొందారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దరియావలి, ఎంఈవో - 2 నిర్మల, ట్రైనర్ వెంకాయమ్మ, సీసీహెచ్‌లు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

• లాంఫాం ప్రాంతీయ పరిశోధనా స్థానం ఏడీఆర్ దుర్గాప్రసాద్



మొక్కలు నాటుతున్న లాంఫాం ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు

లాంఫాం(తాడికొండ), జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని లాంఫాం ప్రాంతీయ పరిశోధనా స్థానం ఏడీఆర్ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అంతేకాకుండా ఖరీఫ్ విత్తన దినోత్సం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని తెలిపారు. జూట్ సంచులను వినియోగించాలన్నారు. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్న తరుణంలో విత్తన ఎంపిక విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యవసాయ యూనివర్సిటీ నుంచి విత్తనాలు పొందవచ్చునని తెలియజేశారు. రైతులకు ఎల్‌ఆర్‌జీ 494 కందిరకం చిరు సంచులు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మోహన్‌రెడ్డి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎంటీఎంసీ అధికారులు, కూటమి నేతలు

• మండల పరిధిలోని మోతడకలో ఐటీసీ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక పండుగలా కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. మాజీ సీఎం జగన్ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు చెట్లు నరికేవారని గుర్తు చేశారు. ప్రతి ఇంటి పెరటిలో మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, టీడీపీ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

• ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా

మంగళగిరి సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భావి తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించా లంటే పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సూచించారు. ఎంటీఎంసీ కార్యాలయం వద్ద గురువారం మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వస్తువులను పారవేసి అధికారులు, సిబ్బంది ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ పీ శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కాంద్రు భానుకిషోర్, డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, ఎంటీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. మంగళగిరి ఆర్టీసీ డిపో ఆవరణలో జోన్-3 ఈజెడ్ జీ.నాగేంద్రప్రసాద్ మొక్కలు నాటారు. ఆర్టీసీ ఇన్‌చార్జి డిప్యూటీ సీఎంఈ కే.సత్యనారాయణ, సూప రింటెండెంట్ శ్రీనివాస్, మంగళగిరి డిపో మేనేజర్ రెండపాళ్ల పిచ్చియ్య పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చిలువూరులో ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ మాణిక్యం, ఎంపీటీసీ రోజ మరియమ్మ, తోటకూర సీతారామయ్య, యేళ్ల జయలక్ష్మి, నిజాముద్దీన్, యడ్ల రామారావు, పలువురు నాయకులు, పంచాయతీ కార్యదర్శి శరత్ తదితరులు గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. దుగ్గిరాలలో పలుచోట్ల 200కు పైగా మొక్కలను నాటారు. సర్పంచ్ బాణావత్ కుషీబాయి, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, గూడూరు వెంకట్రావు, కొంగర జోగేంద్ర ప్రసాద్, వల్లూరు నరసింహారావు, గద్దె శ్రీనివాస్, పలువురు కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బం ది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ

• ఎంపీడీవో యుగకీర్తి



కాకుమానులో సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీడీవో యుగకీర్తి తదితరులు

కాకుమాను, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఎంపీడీవో యుగకీర్తి అన్నారు. కాకుమాను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ వద్ద గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలు తల్లితో సమానమన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు విరివిగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సింగారావు, ఈవో పిఆర్డీ రవిబాబు, సర్పంచ్ శివకుమారి, పంచాయతీ కార్యదర్శి శంకరరావు పాల్గొన్నారు.

గార్లపాడులో మొక్కల పంపిణీ

మండలపరిధిలోని గార్లపాడులో సర్పంచ్ రామినేని సురేష్ ఉపాధి హామీ కూలీలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాలను అధిగమించాలంటే విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలు సంరక్షించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



కొల్లా వారి చెరువుపై మొక్కలు నాటుతున్న ఎంపీడీవో లక్ష్మీదేవి

మండలంలో వనమహోత్సవం

పెదనందిపాడు, జూన్, 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఆర్‌జీఎస్‌ఈ సహకారంతో మొక్కలు నాటారు. కొప్పర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో టీడీపీ సీనియర్ నాయకుడు బత్తిని వేణు, వరగానిలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఆయా గ్రామాల్లో పలువురు టీడీపీ నాయకులు మొక్కలు నాటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు మొక్కలు ఎంతో దోహదపడతాయన్నారు. వరగాని గ్రామంలో మొక్కలు పరిరక్షణకు టీడీపీ నాయకులు చెన్నుపాటి శివనాగేశ్వరరావు, నూతి పూర్ణచంద్రరావులు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య, బండి నాగబాబు, కొల్లా సురేష్, మాకినేని శ్రీకాంత్, చెన్నుపాటి సురేంద్ర, సర్పంచ్‌లు పాలపర్తి లక్ష్మీ, చెన్నుపాటి నరసింహారావు, నాయకులు బత్తిని వేణు, ఆళ్ల పణిబాబు, బొగ్గవరపు చంద్రశేఖర్, ఈదర బ్రహ్మానందం, యాగంటి బొల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సేవ.. అత్యుత్తమ సేవ

• వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు



జెండా ఊపి కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు

తాడేపల్లి టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో భగవంతుని అనుగ్రహం పొందేందుకు ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ వాటిలో అన్నదాన సేవ అత్యుత్తమ సేవా మార్గమని వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ రోడ్డులో ఉన్న ఆర్ఎల్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్ నివాసితులు ఎన్ఎస్‌వీ ప్రసాద్ నన్నపనేని, రేవతి నన్నపనేని దంపతులు, అక్షయిత, శ్రీహిత, నన్నపనేని కుటుంబసభ్యుల సహకారంతో టీటీడీ నిత్యాన్నదాన నిర్వహణ కోసం పంపుతున్న పది టన్నుల కూరగాయల వాహనానికి గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాంతశ్రీ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఏర్పాటు



ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు

మంగళగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఆటోనగర్‌లోని ఫైకేర్ సర్వీసెస్ కంపెనీ నిర్వాహకులు పెండ్యాల శ్రీకాంత్ మాతృమూర్తి శాంతకుమారి జ్ఞాపకార్థం శాంతశ్రీ ఎడ్యుకేషనల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ట్రస్టు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత, సేవా దృక్పథాన్ని పెంపొందించేలా ఇలాంటి ట్రస్టును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రెండు సంవత్సరాలుగా కంపెనీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఉద్యోగులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఫై కేర్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకులు పెండ్యాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షిక పూజలు, హోమాలు



లింగాయపాలెంలో హోమాలు నిర్వహిస్తున్న రుత్వికులు

తుళ్లూరు(లింగాయపాలెం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో హోమాలతో లింగాయపాలెంలో బొడ్రాయి వార్షికోత్సవం గురువారం నిర్వహించారు పోతురాజు వేపచెట్ల వద్ద పొంగళ్లు పొంగించారు. అనంతరం గ్రామం నడిబొడ్డులో ఉన్న బొడ్రాయికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహస్వామి, అమరావతి నగరం సస్యశ్యామలంగా ఉండాలని సుదర్శన గణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు మిత్రులతో లింగాయపాలెం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా గ్రామస్థులు అన్నదానం నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు గాజు గ్లాసుల పంపిణీ



టీస్టాల్‌లో గాజు గ్లాసులను అందజేస్తున్న జనసేన నాయకుడు శంకరరావు

తుళ్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గాజు గ్లాసుల పంపిణీతో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని గురువారం జనసేన నాయకులు నిర్వహించారు. తుళ్లూరు టీస్టాల్ నిర్వహకులకు, హరిశ్చంద్రపురం టీస్టాల్‌లో జనసేన నాయకులు గల్లా శంకరరావు గాజు గ్లాసులను అందజేశారు. పర్యావరణానికి ప్రజల ఆరోగ్యానికి ప్లాస్టిక్ పెనుప్రమాదంగా మారిందని, ప్లాస్టిక్‌ను నిషేధించటం ఒక్కటే మార్గమని శంకరరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గాజు గ్లాసుల వాడే విధంగా టీ స్టాల్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదిగలకు ఏడు శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

• ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మంగళగిరి సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రోస్టర్ మొదటి వరుసలో మాదిగలకు ఏడుశాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో గురువారం జరిగిన ఆంధ్ర మాదిగ సంఘాల రాష్ట్ర స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన మాలలకు మొదటి వరుసలో 8 శాతం, వెనుకబడిన మాదిగలకు ఆరు శాతం కేటాయించడం ఎక్కడి సామాజిక న్యాయమని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా ప్రభుత్వం వ్యవ హరించడం సరికాదన్నారు. తమిళనాడు తరహాలో మూడు శాతం రిజర్వేషన్లు అదనంగా ఇవ్వాలని కోరారు. మాదిగలకు ఏడు శాతం రిజర్వేషన్ ఇచ్చి సమన్యాయం చేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు అనుమల వంశీకృష్ణ, విజయ్ అంబేడ్కర్, మట్టా వరసాయిప్రసాద్, వనం నాగేశ్వరరావు, శెట్టి సృజనారావు, దాచేపల్లి రామాంజనేయులు, మందా నాగమల్లేశ్వరరావు, తప్పెట శివ, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' అమలుచేయాలి

తాడేపల్లి టౌన్ జూన్ 5(ఆంధ్రజ్యోతి) కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల్లు ఇవ్వాలని ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలపరిధిలోని గుండెమెడలో కౌలు రైతులను కలసి విస్తృత ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో ఇప్పటికి 70శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద అకౌంట్లో జమ చేయాలన్నారు. కౌలు రైతుసంఘం నాయకులతో కలసి కరపత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాకముందు ఎన్నికల వాగ్దానంలో రైతులు, కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పింరన్నారు. సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదన్నారు. రైతులతో పాటు కౌలు రైతులకు పథకం వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కౌలు రైతు కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ రైతు, కౌలు రైతు సమస్యలపై జరుగు ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌలురైతులు రత్తయ్య, వీరయ్య, తదితరులు పాల్గన్నారు.

కాలువలోకి పల్టీకొట్టిన కారు

దుగ్గిరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామశివారులో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలోకి పల్టీకొట్టింది చిలువూరు మీదుగా నుంచి కెఆర్‌కొండూరు వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు అంచు దిగి కాలువలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ కాల్వలో నీరు తక్కువగా ఉండటంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

రాజధాని అమరావతిలో వనమహోత్సవం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజధాని అమరావతిలో అనంతవరం పార్కులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలసి గురువారం మొక్కలు నాటారు. వీఐటీ విద్యార్థులు వీరితో కలసి రెండు వేల మొక్కలు నాటారు. పర్యావరణానికి సంబంధించిన వివిధ రకాల స్టాల్స్‌ను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పరిశీలించారు.



స్టాల్స్‌లో వస్తువులను పరిశీలిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్



సభకు హాజరైన రాజధాని మహిళలు



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న వీఐటీ విద్యార్థులు

వడ్రాణంకు జనసేన నాయకుల అభినందనలు



వడ్రాణం హరిబాబును అభినందిస్తున్న ముట్లూరు జనసేన నాయకులు

వట్టిచెరుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు డీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం డీసీఎంఎస్ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి మండలంలోని ముట్లూరు గ్రామానికి చెందిన జనసేన నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు పత్తి పాపారావు, జాన్‌బాబు, మండల ఉపాధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి వెంకట్, మండల కార్యదర్శి జీ వెంకట్, వార్డు సభ్యులు టీ పాపారావు, శాయి, పఠాన్, బాజీ, నాగయ్య, కిషోర్ పాల్గొన్నారు.

డొంకరోడ్డు మరమ్మతులతో తీరనున్న రైతుల కష్టాలు



చింతలపూడి-ఈమని మధ్య జరుగుతున్న డొంకరోడ్డు మరమ్మతు పనులు

దుగ్గిరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి-ఈమని డొంకరోడ్డు మరమ్మతులతో రైతుల కష్టాలు తీరనున్నాయి. గ్రామానికి చెందిన వందలాది మంది రైతులు డొంక రోడ్డు ఆక్రమణకు గురికావడంతోనూ, కాల్వపూడిక తీయకపోవడంతోనూ వర్షాకాలంలో తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతూ వచ్చారు. రైతులు పంటను తరలించేందుకు కనీసం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు సైతం వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని, గ్రామసర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. రెండ్రోజులుగా జేసీబీతో పంటకాల్వలో మట్టిని తీయించి డొంకరోడ్డుపై వేయించారు. మూడు కిలోమీటర్లమేర రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు బాట ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శివపార్వతి, శివరామప్రసాద్, సుబ్బారెడ్డి

ప్రత్తిపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో రీ మోడల్ చేసిన పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో శివపార్వతి ప్రారంభించారు. ఈ పంచాయతీ కార్యాలయం పూర్తిగా పాడై పోవడం, గత వైసీపీ హయాంలో దీనిని గురించి పట్టించుకోకుండా అద్దెకు పంచాయతీ భవనాన్ని తీసుకుని అందులోనే సచివాలయం కూడా నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ముందుగా తెలుగుదేశం పార్టీ పెద్దలు పంచాయతీ కార్యాలయ భవనంపై దృష్టి పెట్టారు. వెంటనే పంచాయతీ కార్యాలయాన్ని రీ మోడల్ చేయించారు. దీనికి టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, దక్కుమళ్ల భాగ్యారావు, ఎంపీడీవో శివపార్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతోనే సమగ్ర భూ రీసర్వే

కాకుమాను, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతుల భాగస్వామ్యంతోనే ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర భూ రీసర్వే పూర్తవుతుందని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. కాకుమానులో బుధవారం నుంచి ప్రారంభమైన సర్వే పనులను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ సర్వే కోసం 7 టీంలు, 14 బ్లాక్‌లుగా విభజించి ఒక్కో టీం నుంచి ఇద్దరు సర్వేయర్‌లు, ఒక వీఆర్వో సహాయంతో పనులను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఇరవై ఎకరాలు సర్వే చేయాలనే లక్ష్యంతో పని చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వే జరుగుతన్న ప్రదేశాల్లో రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు, పొలం పట్టాలను తీసుకువచ్చి సర్వేకు సహకరించాలని సూచించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణ, మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని రామలింగేశ్వరపేట, చినరావూరు, తోటావారివీధి-1,2, డొంకరోడ్డు, రాజుల కాలని, రైస్ కాలనీ, అమరావతి ప్లాట్స్, ఇందిరానగర్, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు, కుమార్ కాలనీ, రూరల్ గ్రామాలు అత్తోట రోడ్డు, ఇండస్ట్రియల్ ఏరియా, నందివెలుగు గ్రామాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. మెరుగైన విద్యుత్ అందించేలా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం వంటివి చేపట్టామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పొన్నూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో అనుమానాస్పద రీతిలో యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన షేక్ సైదా (30), పొన్నూరు పట్టణంలో సిమెంట్ పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. గత కొంత కాలంగా సైదా, అతని భార్యకు విభేదాలు రావటంతో విడిగా ఉంటున్నాడు. వారం రోజుల నుంచి పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఓ లాడ్జిలో ఉంటున్నట్లు సమాచారం. ఆ లాడ్జి ముందు సైదా శవమై తేలాడు. అయితే సైదా మద్యం మత్తులో భవనం పైనుంచి పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తుండగా సోషల్ మీడియాలో సైదా హత్యకు గురై ఉంటాడని జోరుగా ప్రచారం సాగింది. మృతదేహం ఉన్న తీరు ఆధారంగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సైదా మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సైదా మృతిపై అర్బన్ పోలీసులు పలు కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని వేసవి చలివేంద్రంలో శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి సభ్యులు మజ్జిగను పంపిణీ చేశారు. గురువారం శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృందం సేవా సమితి సభ్యులు ఏర్పాటుచేసిన చలివేంద్రంలో వైష్ణవి జూనియర్ కాలేజీ అధినేత పాటిబండ్ల శ్రీనివాసరావు సహకారంతో పాదచారులకు, ప్రయాణికులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎస్ భక్త బృందం సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో సభ్యులు సీహెచ్ శ్రీనివాసరావు, పి. నవీన్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు మోహనరావు మృతి

తెనాలి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో నివాసం ఉంటున్న సీపీఎం సీనియర్ నాయకులు గాలిముట్టు మోహనరావు (77) గురువారం మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పేదల సంక్షేమం కోసం పోరాటాలు చేసేందుకు కృషి చేశారని జిల్లా కార్యదర్శి వై.నేతాజీ చెప్పారు. ఆయన భౌతికకాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. చెంచుపేటలో యువజన సంఘాన్ని స్థాపించి కార్మికుల హక్కుల కోసం కృషి చేశారని డాల్‌మిల్, రైస్‌మిల్లు యూనియన్ల స్థాపనకు పాటు పడ్డారని చెప్పారు. డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, పట్టణ కార్యదర్శి బాబుప్రసాద్, ములకా శివ సాంబిరెడ్డి, అగస్టీన్, రాజ్యలక్ష్మి, శేషగిరిరావు, జోనేష్ తదితరులు నివాళులర్పించారు.

ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

తెనాలి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలో దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఆర్.చినవెంకటేశ్వర్లు తెలిపారు. జూన్ 6న కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో తెనాలి ఐటీఐలో హాజరు కావాలని కోరారు. 1490 సీట్లకుగాను 298 అప్లికేషన్లు మాత్రమే వచ్చాయన్నారు.



ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మలను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మలకు సత్కారం

తెనాలి, మారీసుపేట,జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, బండి శేషన్న అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పురపాలక సంఘంలో ఫారన్ సర్వీస్‌పై ఆరోగ్య శాఖాధికారి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె హెలెన్ నిర్మల డెప్యూటేషన్ కాలం పూర్తి చేసుకొని సొంత డిపార్టుమెంటుకు వెళుతున్న సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ శేషన్న ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పురపాలక సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ హెలెన్ నిర్మలను చైర్‌పర్సన్ రాధిక దుశ్శాలువాతో సత్కరించి పూలగుచ్చం అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, టీపీవో సాంబశివరావు, మున్సిపల్ ఏఈలు, మేనేజర్ జయకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మురుగుతో నిండిపోయిన 2వ వార్డు వీధి

కొలకలూరులో రోడ్లపై మురుగు

● కాలువల్లో పూడిక తీయక ఇక్కట్లు
● ఇబ్బందులుపడుతున్న 2వ వార్డు ప్రజలు

తెనాలి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మురుగునీరు పారుదల లేక రోడ్లపైనే ఆ నీరు చేరి రోజుల తరబడి నిలిచి ఉండటంతో అవస్థలు తప్పటంలేదు. మండలంలోని కొలకలూరులో రెండో వార్డు కరణంగారి బజారు దుస్థితిపై ఆ వార్డుప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రావెల్ రోడ్డుగా ఉన్న ఆ వార్డులో సీసీరోడ్డు నిర్మించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోయాయని అందరూ సంతోషించారు. కాగా రోడ్డు వేసి డ్రైన్ల నిర్మాణంపై దృష్టిపెట్టకపోవడంతో సమస్య మొదలైంది. కాలువలో నిర్మిస్తారని ఎదురు చూసే క్రమంలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారం చేపట్టింది. ఎన్నిసార్లు కాలువల గురించి చెప్పినా పట్టించుకోకపోవడంతో కొందరు ఆ ప్రాంత వాసులు సొంత నిధులు వెచ్చించి కాలువలను కొంత మేర నిర్మించుకున్నారు. రోజులు గడిచే కొద్ది కాలువల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మరో పక్క ఉన్న రోడ్డు ఎత్తుగా ఉండటంతో ఆ ప్రాంతంలోని మురుగునీరంతా దిగువన ఉన్న ఈ వార్డులో చేరి మొత్తం మురుగుమయంగా మారింది. దీంతో ఆ బజారులో నివసించే దాదాపుగా 40 కుటుంబాల వారు అపరిశుభ్ర వాతావరణంలో దుర్గంధం, దోమల ఉధృతితో అల్లాడిపోయే పరిస్థితి. పైగా చిన్నారులు, వృద్ధులు ఉన్న ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించాలన్నా ఆ మురుగునీటిలో నుంచే వెళ్లాల్సిన దుస్థితి. పలువురు మురుగు బయటకు వెళ్లే మార్గంలేక ఇంటి వద్దనే ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోగా అందుకు అవకాశం లేని వారు మాత్రం పంచాయతీ వారు పట్టించుకోకపోతారా అని ఎదురు చూస్తున్నారు. వేసవి కాలంలోనే ఈ విధంగా మురుగు నీరు నిలిచి ఉంటే వర్షాకాలంలో ఆ వీధి పరిస్థితి ఊహించుకుంటేనే భయంగా ఉందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. తాము పన్నులు సకాలంలో కడుతున్నా.. సమస్యపై పలుమార్లు చెబుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. తమ వీధికి వచ్చి పరిశీలిస్తే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా వార్డులో నెలకొని ఉన్న సమస్యలపై అధికార యంత్రాగం దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. గురువారం స్థానిక చెంచుపేటలోని అమరావతి ప్లాట్స్‌లోని సీ బ్లాక్ మున్సిపల్ స్థలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ శేషన్నతో కలసి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూతాపాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. అనంతరం మొక్కలను నాటి, మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు ఎం.సంధ్యారాణి, యాతాడి అనిల్, అసిస్టెంట్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు, మేనేజర్ జయకర్, ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు): భావి తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షించాలని చేబ్రోలు ఎంఈవో రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పాఠశాలతో పాటు గ్రామంలో అమ్మ పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు పాల్గొన్నారు.

● పెదకాకాని: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు.

● తెనాలి అర్బన్: ఐతానగర్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి బి.వెంకట్, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, కమిటీ చైర్మన్ గాలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: చెట్లను పెంచడం వలన పర్యావరణను పరిరక్షించుకోవచ్చునని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణలో ఎంపీపీ పద్మావతి అధికారులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లిపర: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లభాపురం, అత్తోట గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లభాపురం నిర్మల, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ నాయకులు విప్పల రమేష్‌రెడ్డి, కొండా సూరారెడ్డి, దాసరి నరసయ్య, కొరారు అంజనేయలు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మానవాళి భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తులు వివేకవర్ధన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, సురేష్, కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పెదకాకాని: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం సిబార్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తక్కెళ్లపాడు రహదారి వెంబడి వేసిన చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలను తమ శ్రమదానంతో శుభ్రపరిచి, ప్రజలలో శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రహదారి పక్కనున్న భారీ చెత్తను తొలగించేందుకు కళాశాల యాజమాన్యం పొక్లెయిన్, ట్రాక్టర్లను కూడా ఏర్పాటు చేశారు. గ్రామ పరిసర ప్రాంతాలలో పర్యావరణ సమతుల్యతను పెంపొందించేందుకు 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, నేషనల్ డెంటల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ పి. రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ బి. నాగేష్, ఇతర బోధన సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: పర్యావరణానికి పెనుప్రమాదంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిలిపివేసి భావితరాలు ఆరోగ్యకరమైన జీవితం గడిపేలా ప్రతి ఒక్కరం బాధ్యతగా మెలుగుదామని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కొలకలూరులో వనమహోత్సవ కార్యక్రమానికి ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్‌లు పాల్గొని అధికారులు, గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు



మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో దీప్తి, ఈవోపీఆర్డీ ప్రసాద్, అధికారులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ మల్లికార్జునరావు తదితరులు

వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు చేసిన అప్పును తీర్చేందుకు ప్రియుడు దొంగతనానికి పాల్పడి, వృద్ధురాలిని హత్య చేసిన ఘటన పోలీసుల విచారణలో వెలుగుచూసింది. ఈ నెల 3న తెనాలి పట్టణంలోని ముత్తెంశెట్టిపాలెంలో టిఫిన్ బండి నడిపే వృద్ధురాలు నాగమల్లేశ్వరి(65) అనుమానాస్పదంగా మృతిచెందింది. బీరువా తెరచి నగలు అపహరణకు గురవడాన్ని గుర్తించిన ఆమె కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు చేపట్టిన దర్యాప్తులో విస్తురపోయే విషయాలు వెల్లడయ్యాయి. గురువారం ఈ కేసు వివరాలను డీఎస్పీ జనార్ధనరావు విలేకరుల సమావేశంలో వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ హత్యకు గురైన వృద్ధురాలి ఇంటి పక్కనే అద్దెకు నివసిస్తున్న నన్నిపాముల తారక జోషి అతని తమ్ముడు నన్నిపాముల సతీష్‌కుమార్‌లు ఈ నెల 3న తెల్లవారుజామున వృద్ధురాలు నీళ్ల కోసం పంపు వద్దకు వచ్చిన సమయంలో ఆమె గొంతునులిమి చంపి ఇంట్లో మంచంపై పడుకోబెట్టారు. ఇంట్లో బీరువాలో దాచిఉంచిన నగలను దోచుకుపోయారు. అదే ప్రాంతంలో నివాసముంటున్న తారకజోషి ప్రియురాలు గాజులవర్తి కీర్తికి వాటిని అప్పగించారు. అసలు చోరీ చేయడానికి ప్రధానంగా ప్రియురాలు అప్పుచేయడంతో అవితీర్చేందుకు చోరీచేసేందుకు వృద్ధురాలిని హత్య చేసినట్లు తెలిసింది. ముగ్గురు నిందితులను గురువారం అదుపులోకి తీసుకుని వారి నుంచి దొంగిలించిన 47.7 గ్రాముల బంగారు నగలు, 210గ్రాముల వెండి పట్టాలను రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు వెల్లడించారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలను డీఎస్పీ అభినందించారు.



నూతక్కి అబ్రహం, జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్ఐ, తదితరులు

సమాజాన్ని చైతన్యవంతులను చేసే అబ్రహం రచనలు

● త్రీటౌన్ ఎస్ఐ కరిముల్లా

తెనాలి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆనాడు సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి మధుర కవిగా నూతక్కి అబ్రహం చిరస్థాయిగా నిలిచిపోయారని త్రీటౌన్ సీఐ షేక్ కరిముల్లా అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరులో పురవేదిక వద్ద మధుర కవి నూతక్కి అబ్రహం 26వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి నూతక్కి అబ్రహం, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అబ్రహం చేసిన రచనలపై మాజీ జ్యుడీషియల్ అధికారి ఉన్నం అహేజ్జేల్, సహజకవి అయినాల మల్లేశ్వరరావులు సభలో మాట్లాడుతూ మహాకవి గుర్రం జాషువా ప్రియ శిష్యుడిగా సమాజంలో రుగ్మతలపై అబ్రహం పలు రచనలు చేశారనిన్నారు. కార్యక్రమంలో మోదుకూరి జాన్సన్, నూతక్కి అబ్రహం, వల్లూరి వెంకటరామయ్యచౌదరి, మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ, కె.మోహన్‌మాదిగ, నూతక్కి అచ్చుతాచారి, సొపాటి కోటేశ్వరి, గద్దె ఝాన్సీ, డాక్టర్ నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన వైద్యం ఆయుర్వేదం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ

తెనాలి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వైద్యం ఆయుర్వేదమని పలు వ్యాధులకు సంజీవనిగా పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ చెప్పారు. స్థానిక కొత్తపేటలో ఏర్పాటు చేసిన కశ్యప్ ఆయుర్వేద వైద్యశాలను గురువారం ఆమె ప్రారంభించారు. వైద్యురాలు చావా సకృత, చావా మహిత, డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, డాక్టర్ సాంబశివరావు, యదుకృష్ణ, రవీంద్రనాథ్, చక్రవర్తి, బాబ్జీ రామమోహనరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి: ఎంఈవో

కొల్లిపర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వహకులకు విద్యాశాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ పాఠశాలలు వారం రోజుల్లో ప్రాంభం కానున్నాయని కాబట్టి ఏజెన్సీల నిర్వాహకులు ఆహారం మరింత రుచిగా శుచిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఝాన్సీలత, సీఆర్పీలు పిడపర్తి రమేష్ బాబు, వి.మురళి, అలేఖ్య, స్వరూపరాణి, రాంబాబు, సురేష్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

తెనాలి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం కొలకలూరు కాల్వ కట్టలపై నివసిస్తున్న ఎస్‌టిలకు సినీ దర్శకుడు దిలీప్‌రాజా గురువారం దుస్తులు అందజేశారు. తాగునీటి సదుపాయం లేకపోవడంతో వారికి ఒక మంచినీటి చేతి పంపు కూడా ఏర్పాటు చేస్తానని చెప్పారు.

● శ్రీసాయి ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో చినరావూరు డొంకలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. కేశవ మఠం అప్పయ్య, వెంకట్రావు సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో సాయిలక్ష్మరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, చెల్లికి వెన్నుపోటుపొడిచిన జగన్

● టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు కిరణ్

తెనాలి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధికోసం తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచి నీచ రాజకీయాలకు తెరలేపిన నాయకత్వం జగన్‌మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీదని టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సొపాటి కిరణ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ తలపెట్టిన కార్యక్రమాన్ని ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రం ఏవిధంగా దెబ్బతిందో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో పేదవాడికి వెన్నుపోటు పొడిచి లబ్ధిపొందిన నాయకత్వం వైసీపీదేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనవసరంగా ప్రజల్లో కూటమిపై బురదజల్లెందుకు ప్రయత్నించి నవ్వులు పాలు కావద్దని హితవు పలికారు. పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు అత్తోట శరత్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకశాలు కల్పించేలా జాబ్ క్యాలెండర్ తెస్తామని జాబ్‌లెస్ క్యాలెండర్‌తో జగన్ వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు కోపల్లె శ్రీను మాట్లాడుతూ గంజాయి మత్తులో దాడులకు పాల్పడే రౌడీషీటర్లకు అండగా నిలిచే పార్టీ జగన్ పార్టీ అని వెన్నుపోటు రాజకీయాలు ఆ పార్టీకే సొంతమని ఆక్షేపించారు. రౌడీలకు మద్దతుగా నిలిచే వైసీపీకి రాష్ట్రంలో జరిగే మంచి కనబడటంలేదని ఇకనైనా బుద్ధిమార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు, చావా రాజేంద్రప్రసాద్, సురేష్, వెంకటేశ్వర్లు, కుదరవల్లి శ్రీనివాసరావు, వసంత అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు ఎమ్మెల్యే నరేంద్ర పరామర్శ



వంశీకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులను గురువారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పరామర్శించారు. మండల పరిధిలోని ఆరెమండ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గరిగంటి సాయిబాబు, మామిళ్లపల్లికి చెందిన వంశీకృష్ణ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఇద్దరిని ఎమ్మెల్యే నరేంద్రకుమార్, మండల తెలుగు యువత అధ్యక్షుడు మువ్వా వెంకట కృష్ణ పరామర్శించారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే సహించేదిలేదు

● మున్సిపల్ కమిషనర్ శేషన్న



శానిటేషన్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందితో అన్నారు. గురువారం స్థానిక మారీసుపేటలో జరుగుతున్న శానిటేషన్ గ్యాంగ్ వర్క్‌ను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్లలోని సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని మురుగునీటి పారుదలకు అడ్డంకులు ఏర్పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ భారీ కాంస్య విగ్రహం తయారీ



ఛత్రపతి శివాజీ కాంస్య విగ్రహంతో శిల్పులు, కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్య శిల్పశాలలో శిల్పులు తీర్చిదిద్దిన ఛత్రపతి శివాజీ కాంస్య విగ్రహాన్ని గురువారం జగ్గయ్యపేటకు తరలించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర ఈ విగ్రహాన్ని 1200 కిలోల కంచుతో 10 అడుగుల ఎత్తులో మూడు నెలల పాటు శ్రమించి తీర్చిదిద్దారు. విగ్రహ నిర్మాణ కమిటీ, హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో విగ్రహాన్ని తరలించారు. శివాజీ వీరగాథను ప్రతి ఒక్కరూ తెలుసుకునేలా విగ్రహాల ఏర్పాటుతో పాటు నాటక ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు నరేంద్ర చెప్పారు. వెంగళరావు, భాస్కరరావు, రఘు, రవిచంద్ర పాల్గొన్నారు. ఈ నెల 9న విగ్రహాన్ని కమలానంద భారతీ స్వామి, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌లు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

ప్రతి రైతు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలి

● ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

కొల్లిపర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పచ్చి రొట్ట పైర్ల ద్వారా రైతులు భూసారాన్ని పెంచుకుని పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి అన్నారు. గురువారం మండల పరిధిలోని దావులూరు, దావులూరిపాలెంలో రైతులు సాగుచేసిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పంటను వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు పరిశీలించారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సాగుపై రైతులకు వ్యవసాయాధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో వినూత్నంగా అమలు చేస్తున్న ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. రైతులందరూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిని పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు అన్నపూర్ణ శ్రీనివాసులు, డీఆర్‌సీ సునీత, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.